తెలంగాణ

TELANGANA MUCHATLU

ముచ్చట్లు

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | బుధవారం-01-ఏప్రిల్-2026 | సంపుటి : 3 | సంచిక : 303 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in





# నేటి నుంచి చికెన్ దుకాణాలు బంద్?

**మార్జిన్ పెంపు డిమాండ్‌తో నిరవధిక ఆందోళన**

**రూ.16కి తగ్గిన లాభాలపై వ్యాపారుల ఆగ్రహం**

**సమస్యలు పరిష్కారం అయ్యే వరకు బంద్ కొనసాగింపు**

**హైదరాబాద్, మార్చి 31 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్రంలో రేపటి నుంచి చికెన్ దుకాణాలు నిరవధికంగా బంద్ కానున్నాయి. పౌల్ట్రీ కంపెనీలు మార్జిన్‌లు పెంచే వరకు బంద్ కొనసాగిస్తామని చికెన్ షాప్ ఓనర్స్ అసోసియేషన్ ప్రకటించింది. ప్రస్తుతం ఇస్తున్న మార్జిన్ తక్కువగా ఉండటంతో వ్యాపారం నష్టాల్లోకి వెళ్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పౌల్ట్రీ కంపెనీలు రిటైల్ దుకాణాలకు కిలోకు రూ.26 మార్జిన్ ఇచ్చేవని, అయితే ఇటీవల అది రూ.16కు తగ్గించారని వ్యాపారులు తెలిపారు. గత ఇరవై ఏళ్లుగా ఒకే విధమైన మార్జిన్ కొనసాగుతుండగా, అకస్మాత్తుగా తగ్గించడం వల్ల తమపై భారమయ్యిందని పేర్కొన్నారు. కిలోకు కనీసం రూ.30 మార్జిన్ ఇవ్వాలని అసోసియేషన్ డిమాండ్ చేసింది.

మిగతా 2లో..



# మూసి పునర్జీవనం పనులపై సమీక్ష..

ప్రజల సూచనలకు ఆహ్వానం.. పారదర్శకంగా ప్రాజెక్టు అమలు

మార్చి 31 నుంచి ఏప్రిల్ 15 వరకు ఆన్‌లైన్ అభిప్రాయాల సేకరణ

డిజైన్, పునరావాసం, ఆర్థిక అంశాలపై వేగవంత చర్యలు

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**హైదరాబాద్, మార్చి 31 (తెలంగాణ ముచ్చట్లు):** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో మూసి పునర్జీవనం పనుల ప్రగతిపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టును పూర్తిగా ప్రజాస్వామ్య పద్ధతిలో, పారదర్శకంగా కొనసాగిస్తామని ఆయన తెలిపారు. ప్రాజెక్టులో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేందుకు మార్చి 31 నుంచి ఏప్రిల్ 15 వరకు ఆన్‌లైన్ ద్వారా అభిప్రాయాల సేకరణ చేపడుతున్నట్లు వెల్లడించారు. ప్రజలు తమ సూచనలను మెయిల్ ద్వారా పంపాలని కోరారు. వచ్చిన ప్రతి సూచనను అధికారులు విశ్లేషిస్తారని తెలిపారు. అవసరమైతే సూచనలు చేసిన వారితో సబ్ కమిటీ సభ్యులు నేరుగా సమావేశమవుతారని పేర్కొన్నారు. ప్రజల ఆలోచనలు, అవసరాలను పరిగణనలోకి తీసుకుని ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తామని చెప్పారు.

మిగతా 2లో..

## సీఐడీ నోటీసులపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆగ్రహం

- ప్రభుత్వంపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాననే కక్షతో వేధింపుల ఆరోపణ
- కుటుంబాన్ని ఇబ్బంది పెట్టడం సరైంది కాదని విమర్శ
- ఏప్రిల్ 4న విచారణకు హాజరు కావాలని సీఐడీ నోటీసులు

2లో



## శాసనసభ నిర్వహణపై తీవ్ర విమర్శలు

- సమయపాలన పాటించడంలేదని ఆరోపణలు
- టీ బ్రేక్ పేరుతో గంటల విరామంపై ప్రశ్నలు
- ప్రజా సమస్యల కంటే ఎన్నికల ప్రచారానికే ప్రాధాన్యతా?

2లో



# కూకట్‌పల్లిలో ఘోర విషాదం

**ఇద్దరు పిల్లలను హతమార్చి తల్లి ఆత్మహత్య**

**వివాహేతర సంబంధం కారణంగా కుటుంబంలో కలహాలు**

**కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు**

**హైదరాబాద్, మార్చి 31 (తెలంగాణ ముచ్చట్లు):**

హైదరాబాద్ నగరంలోని కూకట్‌పల్లిలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. భర్త వివాహేతర సంబంధం పెట్టుకున్నాడన్న మనస్తాపంతో ఓ తల్లి తన ఇద్దరు పిల్లలను హతమార్చి, అనంతరం తాను కూడా ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన కైతలాపూర్ రాఘవేంద్ర కాలనీలో తీవ్ర కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, స్రవంతి (28) అనే మహిళ తన భర్తతో కలిసి నివాసం ఉంటోంది. వీరికి కార్తిక్ (12), కౌశిక్ (8) అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. కొంతకాలంగా భర్త వేరొక మహిళతో సంబంధం కొనసాగిస్తున్నాడన్న విషయం తెలిసి స్రవంతి తీవ్ర మానసిక వేదనకు గురైనట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందిన ఆమె దారుణ నిర్ణయం తీసుకుంది. ముందుగా తన ఇద్దరు కుమారులను హతమార్చి, అనంతరం తాను కూడా ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఘటన వెలుగులోకి రావడంతో స్థానికులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రాథమికంగా కుటుంబ కలహాలు, భర్త వివాహేతర సంబంధమే ఈ ఘటనకు కారణమై ఉండొచ్చని భావిస్తున్నారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. వివిధ కోణాల్లో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. బాధిత కుటుంబ సభ్యులను విచారించి మరిన్ని వివరాలు సేకరిస్తున్నారు. కన్నతల్లి చేతిలోనే పిల్లలు ప్రాణాలు కోల్పోవడం స్థానికంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఈ ఘటన కుటుంబ విలువలు, మానసిక ఆరోగ్యంపై ఆలోచింపజేసేలా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.






# శ్రీశైలం నీటి వివాదం..

**ఏపీపై తెలంగాణ మంత్రి జూపల్లి తీవ్ర విమర్శలు**

**నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారన్న ఆరోపణ**

**తెలంగాణ రైతులకు నీరు లేక పంటలు ఎండిపోతున్నాయన్న ఆవేదన**

**అక్రమ నీటి వినియోగం ఆపకపోతే పోరాటం హెచ్చరిక**

**హైదరాబాద్, మార్చి 31 (తెలంగాణ ముచ్చట్లు):** శ్రీశైలం జలాశయంలో నీటి నిల్వలు తగ్గినా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తోందని తెలంగాణ మంత్రి జూపల్లి కృష్ణారావు తీవ్రంగా విమర్శించారు. ఈ చర్యల వల్ల తెలంగాణలోని ఖమ్మం, నల్గొండ, పాలమూరు జిల్లాల్లో సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నీటి మట్టం తక్కువగా ఉన్న సమయంలో విద్యుత్ ఉత్పత్తి నిలిపివేయాలని స్పష్టమైన నిబంధనలు ఉన్నాయని మంత్రి గుర్తు చేశారు. అయినప్పటికీ ఏపీ ప్రభుత్వం వాటిని పాటించకుండా నీటిని వినియోగిస్తోందని ఆరోపించారు. కనీసం తాగునీటి అవసరాలు కూడా ప్రభావితమవుతున్నాయని పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 2012లో కూడా ఇలాంటి పరిస్థితులు ఏర్పడినట్లు మంత్రి తెలిపారు.

మిగతా 2లో..



# నేర నియంత్రణపై కఠిన చర్యలు తీసుకోవాలి

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్
- ఎన్‌ఫోర్స్మెంట్ విధులపై ప్రత్యేక దృష్టి
- అక్రమ కార్యకలాపాలపై కట్టుదిట్టమైన నిఘా
- పోలీస్ అధికారులతో నేర సమీక్షా సమావేశం

**వరంగల్, మార్చి 31 (తెలంగాణ ముచ్చట్లు):** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నేరాల నియంత్రణకు ఎన్‌ఫోర్స్మెంట్ విధులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ అధికారులకు సూచించారు. మంగళవారం కాకతీయ మెడికల్ కళాశాలలో నిర్వహించిన నేర సమీక్షా సమావేశంలో ఆయన ఈ సూచనలు చేశారు. ఈ సమావేశంలో పెండింగ్ కేసులు, నిందితుల అరెస్టులు, దర్యాప్తులో ఉన్న కేసులు, వారెంట్ల అమలు వంటి అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. పోలీస్ సిబ్బంది పనితీరుపై కూడా కమిషనర్ వివరాలు తెలుసుకున్నారు. నేరాల నియంత్రణకు మరింత సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు.

మిగతా 2లో..

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# మూసి పునర్జీవనం పనులపై సమీక్ష..

(మొదటి పేజీ తరువాయి)

నిర్మాణ డిజైన్లు, పునరావాస చర్యలు, రక్షణ సంబంధిత అంశాలు, బ్యాంకర్లతో చర్చలు వంటి కీలక అంశాలను సమన్వయంతో వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశించారు. పనులు సమయానికి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం



ప్రజల అభిప్రాయాలను ప్రతిబింబించే విధంగా ప్రణాళికలు రూపొందిస్తోందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. మూసి పునర్జీవన ప్రాజెక్టును విజయవంతంగా పూర్తి చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. సంబంధిత శాఖల అధికారులు కూడా హాజరై ప్రాజెక్టు పురోగతిపై వివరాలు వెల్లడించారు.

# గడ్డం రంజిత్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన సీఎం రేవంత్

- కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన ముఖ్యమంత్రి
- చిత్రపటానికి పుష్పాంజలి ఘటింపు

**హైదరాబాద్, మార్చి 31 (తెలంగాణ ముచ్చట్లు):** ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చేవెళ్ల మాజీ ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. ఇటీవల రంజిత్ రెడ్డి తల్లి చంద్రకళమ్మ మరణించిన నేపథ్యంలో వారి నివాసానికి వెళ్లి సంతాపం తెలిపారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ కష్టసమయంలో ప్రభుత్వం వారి పక్కనే ఉంటుందని భరోసా ఇచ్చారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి పరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం చంద్రకళమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పిస్తూ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భనలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు కూడా పాల్గొన్నారు. రంజిత్ రెడ్డి కుటుంబానికి సంఘీభావం తెలిపారు. చంద్రకళమ్మ మరణం పట్ల రాజకీయ వర్గాలు కూడా సంతాపం వ్యక్తం చేస్తున్నాయి. ఆమె కుటుంబానికి మరింత ధైర్యం కల్పించేందుకు పలువురు నేతలు ముందుకు వస్తున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరఫున అవసరమైన సహాయం అందించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు.



# బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులకు ఎంపీ అభినందనలు

- శామీర్‌పేట క్యాంప్ కార్యాలయంలో సత్కారం
- పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచనలు
- ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపు

**మేడ్చల్-మల్కాజిగిరి, మార్చి 31 (తెలంగాణ ముచ్చట్లు):** బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నియమితులైన నేతలను ఎంపీ ఈటెల రాజేందర్ శామీర్‌పేటలోని తన క్యాంప్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీ చింతల మాణిక్య రెడ్డి, శ్రీ గోపు రమణారెడ్డి, శ్రీ యం.ఎస్. వాసు, శ్రీ బక్క శంకర్ రెడ్డి, శ్రీ మధుసూదన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, పార్టీ బాధ్యతలు స్వీకరించిన నాయకులు కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ప్రజల మధ్య ఉండి వారి సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. పార్టీ అభివృద్ధి కోసం ప్రతి నాయకుడు అంకితభావంతో పనిచేయాలని ఈటెల రాజేందర్ పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా ఉండాలని, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

కొత్త బాధ్యతలు స్వీకరించిన నేతలకు శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ, వారి సేవలు పార్టీకి మరింత బలం చేకూరుస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. శాలువాలతో సత్కరించి వారికి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు కూడా పార్టీ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తామని తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని పొందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని నూతనంగా నియమితులైన సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.



# యాసంగి పంటకు సాగునీరు అందించాలి: హరీష్ రావు విజ్ఞప్తి

- అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి 1.5 టీఎంసీల పంపింగ్‌కు నిర్ణయం
- సిద్దిపేటలో 50 వేల ఎకరాల పంటలకు ఊరట

**హైదరాబాద్, మార్చి 31 (తెలంగాణ ముచ్చట్లు):** యాసంగి పంట కాలం పూర్తయ్యేంత వరకు రైతులకు నిరంతర సాగునీరు అందించాలనే లక్ష్యంతో అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి రంగనాయక సాగర్‌కు అదనంగా 1.5 టీఎంసీల నీటిని పంపింగ్ చేయాలని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ నిర్ణయం సిద్దిపేట నియోజకవర్గ రైతులకు పెద్ద ఊరటనిచ్చింది. ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలిసి రైతుల సమస్యలను వివరించారు. యాసంగి పంట కాలం పూర్తయ్యే వరకు నీటి సరఫరా కొనసాగించాల్సిన అవసరాన్ని వివరించుతూ లేఖను అందజేశారు.



గత ఐదు సంవత్సరాలుగా రంగనాయక సాగర్ కాల్వల ద్వారా సాగునీరు అందించడం వల్ల సిద్దిపేట నియోజకవర్గంలో పంట దిగుబడులు గణనీయంగా పెరిగాయని హరీష్‌రావు లేఖలో పేర్కొన్నారు. ప్రతి ఏడాది సాగు విస్తీర్ణం పెరుగుతూ రైతులకు మంచి లాభాలు కలుగుతున్నాయని వివరించారు.

ఈ ఏడాది సుమారు 50 వేల ఎకరాల్లో పంట సాగులో ఉందని, ప్రస్తుతం రంగనాయక సాగర్‌లో కేవలం 1 టీఎంసీ నీరు మాత్రమే అందుబాటులో ఉందని తెలిపారు. ఇప్పటికే 2.4 టీఎంసీల నీటిని పంపింగ్ చేసినప్పటికీ, యాసంగి పంటకు పూర్తి స్థాయిలో నీరు అందించాలంటే ఇంకా 1.5 టీఎంసీల నీరు అవసరమని లేఖలో వివరించారు. సాగునీటి కొరత కారణంగా రైతులు ఆందోళన చెందుతున్నారని, గత సంవత్సరాల మాదిరిగానే ఈసారి కూడా నీటి సరఫరా నిరంతరం కొనసాగించాలని హరీష్ రావు విజ్ఞప్తి చేశారు. రైతుల పంటలు ఎండిపోకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వెంటనే ఇరిగేషన్ అధికారులకు నీటిని పంపింగ్ చేయాలని ఆదేశించారు. యాసంగి పంట కాలం ముగిసే వరకు సాగునీటి సరఫరా కొనసాగించాలని స్పష్టం చేశారు. ఈ నిర్ణయంతో సిద్దిపేట ప్రాంత రైతులకు పెద్ద ఉపశమనం లభించింది. పంటల రక్షణకు అవసరమైన నీటి అందుబాటు పెరగడంతో రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం రైతుల ప్రయోజనాల దృష్ట్యా చర్యలు తీసుకుంటోందని అభిప్రాయపడుతున్నారు.

# నేర నియంత్రణపై కఠిన చర్యలు తీసుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

అక్రమ ఇసుక రవాణా, గుట్కా విక్రయాలు, రేషన్ బియ్యం దుర్వినియోగం, పేకాట, బెట్టింగ్ వంటి అక్రమ కార్యకలాపాలను కట్టడి చేయాలని ఆదేశించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎన్‌ఫోర్స్మెంట్ చర్యలను బలోపేతం చేయాలని చెప్పారు. గంజాయి విక్రయాలకు పాల్పడే మూలాలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు. వినియోగదారులను మాత్రమే కాకుండా సరఫరా చేసే వ్యక్తులను కూడా పట్టుకునేలా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. చోరీలు నివారించేందుకు హిస్టరీ షీట్లు తెరవడం, అధికంగా చోరీలు జరిగే ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం, వాటిని జియోట్యాగింగ్‌కు అనుసంధానం చేయాలని సూచించారు. ప్రజల భాగస్వామ్యంతో కాలనీల్లో సీసీ కెమెరాల ఏర్పాటు చేపట్టాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం 'అరైవ్‌అలైవ్' కార్యక్రమం ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించాలని, ప్రతి స్టేషన్ పరిధిలో వినూత్న కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. రాబోయే హనుమాన్ జయంతి వేడుకలు ప్రశాంతంగా జరిగేందుకు ముందస్తు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో పలువురు డిసిపిలు, ఏసిపిలు, ఇన్స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీశైలం నీటి వివాదం..

(మొదటి పేజీ తరువాయి)

అప్పుడు తెలంగాణ నాయకులు ధర్నాలు చేసి, హైకోర్టును ఆశ్రయించగా స్పష్టమైన ఆదేశాలు వచ్చాయని గుర్తు చేశారు. ప్రస్తుతం కూడా అదే విధానాన్ని ఏపీ ప్రభుత్వం కొనసాగిస్తోందని విమర్శించారు. శ్రీశైలం ప్రాజెక్టులో తెలంగాణకు 64 శాతం వాటా ఉందని జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. నీటి కేటాయింపులపై ఇప్పటికే స్పష్టమైన జీవోలు ఉన్నప్పటికీ వాటిని పట్టించుకోవడం లేదని అన్నారు. రైతుల హక్కులను ఎట్టి పరిస్థితుల్లోనూ కాలరాయనివ్వమని స్పష్టం చేశారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ సమస్యను పట్టించుకోకపోవడం వల్లే ఇప్పుడు ఏపీ ప్రభుత్వం అలుసుగా వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. ఇప్పటికైనా అక్రమంగా నీటిని తరలించడం ఆపాలని, లేకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. రైతాంగం, ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ కలిసి పోరాటం చేసి తమ హక్కులను కాపాడుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. నీటి వాటాల విషయంలో ఎలాంటి రాజీ ఉండదని జూపల్లి కృష్ణారావు గట్టి హెచ్చరిక చేశారు.

# సీఐడీ నోటీసులపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆగ్రహం

**హైదరాబాద్, మార్చి 31 (తెలంగాణ ముచ్చట్లు):** తనకు సీఐడీ నోటీసులు అందడంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. ఎక్స్ వేదికగా స్పందిస్తూ, ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాననే కారణంతోనే తనపై చర్యలు తీసుకుంటున్నారని ఆరోపించారు.

"నన్ను లక్ష్యంగా చేసుకుని ఎన్ని కేసులైనా పెట్టండి, నోటీసులు ఇవ్వండి. కానీ నా కుటుంబాన్ని, పార్టీ సభ్యులను ఈ వివాదాల్లోకి లాగడం ఎంతవరకు న్యాయం?" అని ప్రశ్నించారు. తాను ఎలాంటి తప్పు చేయకపోయినా కావాలనే వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

Bఎన్ని నోటీసులు ఇచ్చినా, ఎన్ని బెదిరింపులకు గురిచేసినా తాను వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఇది తన వ్యక్తిగత పోరాటం కాదని, ప్రజల కోసం చేస్తున్న పోరాటమని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు తాను ప్రశ్నిస్తూనే ఉంటానని హెచ్చరించారు.

ప్రశ్నించే గొంతును అధికార బలంతో అణచివేయలేరని, ప్రజల పక్షాన తన పోరాటం నిరంతరం కొనసాగుతుందని ఆయన తెలిపారు. ప్రజాస్వామ్యంలో విమర్శలు సహజమని పేర్కొన్నారు.

ఇదిలా ఉండగా, జనవరి 29న హుజూరాబాద్ నియోజకవర్గం వీణవంకలో జరిగిన మినీ మేడారం జాతర సందర్భంగా పోలీసులతో వాగ్వాదం చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ఈ ఘటనలో కరీంనగర్ పోలీస్ కమిషనర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన సీఐడీ అధికారులు, ఏప్రిల్ 4న విచారణకు హాజరుకావాలని పాడి కౌశిక్ రెడ్డికి నోటీసులు జారీ చేశారు. కేసుకు సంబంధించిన అంశాలపై విచారణ కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు.

# శాసనసభ నిర్వహణపై తీవ్ర విమర్శలు

**హైదరాబాద్, మార్చి 31 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ శాసనసభ నిర్వహణపై బీఆర్ఎస్ నేత టి హరీష్ రావు తీవ్ర విమర్శలు చేశారు. సభకు అవసరమైన గౌరవం, సమయపాలన పాటించడంలేదని ఆరోపిస్తూ ప్రభుత్వ తీరును ప్రశ్నించారు. శాసనసభను రాజకీయ వేదికలా మార్చేశారని ఆయన విమర్శించారు. అసెంబ్లీలో సాధారణంగా టీ బ్రేక్ 10 నిమిషాలు, లంచ్ బ్రేక్ అరగంట మాత్రమే ఉండగా, ముఖ్యమంత్రి ఢిల్లీ నుంచి వస్తున్నారని చెప్పి ఏకంగా నాలుగు గంటల టీ బ్రేక్ ఇవ్వడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థకు అనుకూలం కాదని అభిప్రాయపడ్డారు.

కేరళ ఎన్నికల ప్రచారం కోసం శాసనసభ సమావేశాలను ముందుగానే ముగించారని కూడా ఆయన ఆరోపించారు. 30వ తేదీనే హడావుడిగా సభ ముగించడం వెనుక రాజకీయ ప్రయోజనాలే ఉన్నాయని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై చర్చ జరగకుండా సభను ముగించడం సరైన పద్ధతి కాదని అన్నారు. ప్రజల సమస్యలను చర్చించాల్సిన వేదికగా ఉన్న శాసనసభను రాజకీయ కార్యక్రమాలకు వినియోగించడం బాధాకరమని హరీష్ రావు వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందా అనే సందేహం వ్యక్తం చేశారు.

ప్రభుత్వం ప్రజా సమస్యల కంటే ఎన్నికల ప్రచారానికే ప్రాధాన్యత ఇస్తోందని ఆయన విమర్శించారు. శాసనసభ గౌరవాన్ని కాపాడే విధంగా వ్యవహరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలంటే పారదర్శకంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హరీష్ రావు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు.

# నేటి నుంచి చికెన్ దుకాణాలు బంద్?

(మొదటి పేజీ తరువాయి)

వ్యాపార నిర్వహణ ఖర్చులు పెరిగిన నేపథ్యంలో తక్కువ మార్జిన్‌తో దుకాణాలు నడపడం కష్టమైందని తెలిపారు. ఈ కారణంగా నిరవధిక బంద్‌కు పిలుపునిచ్చినట్లు వెల్లడించారు. చికెన్ విక్రయాల ద్వారా వచ్చే లాభాలు తగ్గిపోవడంతో జీవనోపాధి దెబ్బతింటోందని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్, అద్దె, కార్మిక ఖర్చులు పెరిగినప్పటికీ ఆదాయం తగ్గడం సమస్యగా మారిందని చెప్పారు. తమ డిమాండ్లను ప్రభుత్వం, పౌల్ట్రీ కంపెనీలు గమనించి త్వరితగతిన పరిష్కారం చేయాలని కోరుతున్నారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు బంద్ కొనసాగుతుందని అసోసియేషన్ స్పష్టం చేసింది. ఈ బంద్ కారణంగా రాష్ట్రంలో చికెన్ సరఫరాపై ప్రభావం పడే అవకాశం ఉంది. వినియోగదారులు తాత్కాలిక ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొనే అవకాశం ఉందని వ్యాపార వర్గాలు పేర్కొన్నాయి.

# తెలంగాణలో 5రోజుల పాటు వర్షాలు..

- పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

**హైదరాబాద్, మార్చి 31 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్రంలో వచ్చే ఐదు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈరోజు, రేపు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వడగళ్ల వాన కురిసే అవకాశముందని హెచ్చరించింది. గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. వడగళ్ల వానతో పాటు గాలివానలు కూడా తీవ్రంగా ఉండే అవకాశం ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఈరోజు ఆదిలాబాద్, అసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్, సిద్ధిపేట జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. రేపు కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్, వికారాబాద్ జిల్లాలకు కూడా ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. హైదరాబాద్ నగరంలో ఆకాశం మేఘావృతంగా ఉండి తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. నగర ప్రజలు వర్షాల దృష్ట్యా జాగ్రత్తలు పాటించాలని సూచించింది.

వ్యవసాయదారులు తమ పంటలను రక్షించుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు. వడగళ్ల వాన ప్రభావంతో పంటలకు నష్టం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రజలు అవసరమైన జాగ్రత్తలు పాటించాలని, ముఖ్యంగా ఈదురు గాలులు, మెరుపుల సమయంలో బయటకు వెళ్లకుండా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరించింది.

# జిల్లా కోర్టుల్లో స్పెషల్ మేజిస్ట్రేట్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

- నెలకు రూ.45,000 వేతనం
- ఏప్రిల్ 17 చివరి తేదీ

**మల్కాజిగిరి, మార్చి 31 (తెలంగాణ ముచ్చట్లు):**




మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా జడ్జి యూనిట్ పరిధిలో మార్నింగ్ కోర్టులకు అధ్యక్షత వహించేందుకు స్పెషల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ / సెకండ్ క్లాస్ స్పెషల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ జిల్లా మరియు సెషన్ జడ్జి వెల్లడించారు.అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ districts.ecourts.gov.in/medchal నుంచి దరఖాస్తు ఫారమ్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఎంపికైన వారు వారానికి ఐదు రోజులు (సోమవారం నుంచి శుక్రవారం వరకు) ఉదయం 7:30 నుంచి 10:30 గంటల వరకు కోర్టు నిర్వహణ బాధ్యతలు చేపడతారు.ఈ పోస్టుకు ఎంపికైన వారికి నెలకు రూ.45,000 గౌరవ వేతనం, అదనంగా రూ.5,000 ప్రయాణ భత్యం అందించబడుతుంది. నియామకం ఒక సంవత్సరం కాలానికి మాత్రమే పరిమితం.
అర్హులైన అభ్యర్థులు నోటిఫికేషన్‌తో పాటు దరఖాస్తు ఫారమ్‌ను డౌన్‌లోడ్ చేసి, అవసరమైన పత్రాలతో కలిసి రెండు ప్రతులుగా సమర్పించాలి. దరఖాస్తులు ఏప్రిల్ 17 సాయంత్రం 5 గంటలలోపు మల్కాజిగిరిలోని ప్రిన్సిపల్ జిల్లా మరియు సెషన్ జడ్జి కార్యాలయానికి చేరాలి.దరఖాస్తుదారులు న్యాయ సేవల నుంచి పదవీ విరమణ పొందిన వారు, జ్యుడిషియల్ మినిస్టీరియల్ సర్వీసుల్లో అనుభవం కలిగిన వారు, హైకోర్టు సేవల్లో పనిచేసిన వారు, కనీసం ఐదు సంవత్సరాల అనుభవం ఉన్న న్యాయవాదులు లేదా మేజిస్టీరియల్ అధికారాలను వినియోగించిన విశ్రాంత గెజిటెడ్ అధికారులు అయి ఉండాలి. పదవీ విరమణ పొందిన న్యాయాధికారులకు ప్రాధాన్యత ఇస్తారు.ప్రస్తుతం ప్రాక్టీసింగ్ అడ్వకేట్లు, ప్రజాప్రతినిధులు, నైతిక నేరాల్లో దోషులు, ప్రభుత్వ సేవల నుంచి తొలగించబడిన వారు, దివాలా తీసిన వారు మరియు ప్రభుత్వ కాంట్రాక్టులు నిర్వహిస్తున్న వారు అర్హులు కాదని స్పష్టం చేశారు.మూడు వరుస కోర్టు సిట్టింగ్స్‌కు హాజరు కాకపోతే నియామకం రద్దు చేసే అవకాశం ఉందని, అలాగే 65 సంవత్సరాలు పూర్తి అయిన తర్వాత పదవి స్వయంచాలకంగా ముగుస్తుందని తెలిపారు. ఎంపిక ప్రక్రియలో పాల్గొనే అభ్యర్థులకు ఎటువంటి ప్రయాణ భత్యం ఇవ్వబడదని అధికారులు పేర్కొన్నారు.అర్హతలు కలిగిన వారు గడువు తేదీకి ముందే దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

# మీర్పేట్ హెచ్‌బీ కాలనీలో అభివృద్ధి పనులపై వినతిపత్రం

- ఈడీ ఎస్. పంకజను కలిసి సమస్యలు వివరించిన మాజీ కార్పొరేటర్ ప్రభుదాస్

**నాచారం, మార్చి 31 (తెలంగాణ ముచ్చట్లు)**

ఉప్పల్ నియోజకవర్గం నాచారం సర్కిల్ మీర్పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతూ మాజీ కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ సంబంధిత అధికారులను కలిశారు. ఈ సందర్భంగా హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు, మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) ఎస్. పంకజను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు.కాలనీలలో తాగునీటి సరఫరా లోపాలు, డ్రైనేజ్ సమస్యలు, రోడ్ల మరమ్మతులు వంటి అంశాలు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించి, సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా అధికారులు సమస్యలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. స్థానిక ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు తాను కట్టుబడి ఉన్నానని ప్రభుదాస్ తెలిపారు.







# మానవత్వానికి మారుపేరు యలమందల జగదీష్

- ఇద్దరు పేద కుటుంబాలకు నెలకు సరిపడ నిత్యవసర సరుకులు పంపిణీ

**ఖమ్మం బ్యూరో, మార్చి 31(తెలంగాణ ముచ్చట్లు)**

ఇద్దరు పేద కుటుంబాలకు నెలకు సరిపడ నిత్యవసర సరుకులు పంపిణీ చేసి మానవత్వానికి మారుపేరుగా నాయి బ్రాహ్మణ సేవా సంఘం నగర అధ్యక్షులు అండ్ ఎలక్ట్రానిక్ మీడియా నగర అధ్యక్షులు యలమందల జగదీష్ నిలిచారు. ఖమ్మం అర్బన్ మండలం కైకొండాయిగూడెం, 1వ డివిజన్ లో మంగళవారం బోడ నాగేశ్వరరావు (చిన్న), బోడ ఉమ అనారోగ్యంతో మరణించి అనాదలుగా మిగిలిన ముగ్గురు పిల్లలు ఉన్న కుటుంబానికి, అదేవిధంగా కొడుకు చనిపోయి అనారోగ్యంతో ఒంటరి జీవితం గడుపుతున్న బొమ్మకంటి బూబమ్మ కుంటుంబానికి, ఇరువురి కుటుంబాలకు నెలకు సరిపడ నిత్యవసర సరుకులు, 25కేజీల బియ్యం, కొంత ధన రూపంలో ఆర్థికసాయం అందించి జగదీష్ మానవత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా యలమందల జగదీష్ మాట్లాడుతూ.. పేదవారికి, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం మానవ ధర్మం అన్నారు. మానవసేవయే మాధవసేవ అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గుర్రం వెంకట్రామయ్య, తుళ్లూరు ప్రసాద్, గుర్రం కృష్ణయ్య, తేజావత్ వీరన్న, గద్దల నాగేశ్వరరావు, తేజావత్ సంఘం, జక్కంపూడి సతీష్, తుళ్లూరు మధు, జగదీష్ యువసైన్యం మంచాల నాగ, తోట సతీష్, ఆంగోతు కిషోర్, కంచర్ల శేఖర్, పందుల కార్తిక్, ఉప్పెర్ల ఉదయ్, కొండా రాకేష్, బొమ్మకంటి జగదీష్, లింగనబోయిన నవదీప్, మంచాల రాజు, లింగనబోయిన హేమంత్, మల్లు భరత్, రాగం పండు, వనపర్తి ఉదయ్, తేజావత్ బాలకృష్ణ, కుమ్మరకుంట్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఈసీఐఎల్‌లో రాధా స్టడీ హాల్స్ ప్రారంభం

- మంత్రి వివేక్ వెంకట స్వామి హాజరు
- విద్యార్థులకు ప్రశాంత అధ్యయన వాతావరణం

**కాప్రా, మార్చి 31 (తెలంగాణ ముచ్చట్లు):**



ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ పరిధిలోని ఈసీఐఎల్ సమీప గ్రీన్ హిల్స్ కాలనీలో ఏర్పాటు చేసిన రాధా స్టడీ హాల్స్‌ను మంగళవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకట స్వామి హాజరై ప్రారంభించారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ప్రజా గాయకుడు గోరేటి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల అభ్యాసానికి అనుకూలంగా ఇలాంటి స్టడీ హాల్స్ ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు. ముఖ్యంగా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ప్రశాంత వాతావరణం అందించడం ద్వారా వారి విజయానికి ఇది దోహదపడుతుందని తెలిపారు. మంత్రి వివేక్ వెంకట స్వామి మాట్లాడుతూ, యువతకు అవసరమైన విద్యా వనరులు అందుబాటులో ఉండటం సమాజ అభివృద్ధికి కీలకమని పేర్కొన్నారు. ప్రభుత్వం కూడా విద్యా రంగానికి ప్రాధాన్యత ఇస్తోందని ఆయన తెలిపారు.రాధా స్టడీ హాల్స్ యజమానులు గౌడ రాధ, గౌడ రవి కిరణ్ ఆహ్వానంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అంబేద్కర్ నగర్‌లో మురుగునీటి సమస్యపై మాజీ కార్పొరేటర్ రాజ్యలక్ష్మి ఫైర్

- బోర్‌వెల్స్, త్రాగునీటి సంపుల్లోకి మురుగు నీరు
- వెంటనే పరిష్కారం కోరిన స్థానికులు

**వినాయక్ నగర్, మార్చి 31(తెలంగాణ ముచ్చట్లు)**





మల్కాజ్గిరి నియోజకవర్గం వినాయక నగర్ డివిజన్ అంబేద్కర్ నగర్ కాలనీలో తీవ్రంగా పెరిగిన మురుగునీటి సమస్యపై మాజీ కార్పొరేటర్ క్యానమ్ రాజ్యలక్ష్మి కాలనీని సందర్శించి అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలనీ అధ్యక్షుడు వేణుగోపాల్ ఫిర్యాదు మేరకు ఆమె పరిస్థితిని స్వయంగా పరిశీలించారు.గత ఐదు రోజులుగా మురుగునీటి కాలువలు పొంగిపొర్లుతున్నప్పటికీ వాటర్‌వర్క్స్ శాఖ స్పందించకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు తెలిపారు. మురుగునీరు బోర్‌వెల్స్‌లోకి, త్రాగునీటి సంపుల్లోకి చేరడం వల్ల ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.మ్యాన్‌హోల్స్ సరిగా నిర్మించకపోవడం వల్ల సమస్య మరింత తీవ్రతరమైందని రాజ్యలక్ష్మి ఆరోపించారు. అనంతరం కాలనీ వాసులతో కలిసి మురుగునీటి నమూనాలను తీసుకుని వాటర్‌వర్క్స్ జనరల్ మేనేజర్ సునీల్‌ను కలిసి సమస్య తీవ్రతను వివరించారు. వెంటనే చర్యలు తీసుకుని శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.దీనికి స్పందించిన జనరల్ మేనేజర్ సునీల్, త్వరలోనే కాలనీని సందర్శించి సమస్యను పూర్తిగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు .ఈ కార్యక్రమంలో బీజేపీ కార్యకర్తలు మల్లేష్ యాదవ్, సాయి సురేష్, శృకేశ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.ఇక దినదయాళ్ నగర్ సీనియర్ సిటిజన్స్ విజ్ఞప్తి మేరకు, రాజ్యలక్ష్మి తనకు కేటాయించిన జీహెచ్ఎంసీ నిధులలో రూ.6 లక్షలతో మూడు బాత్రూమ్స్ నిర్మించగా, సీనియర్ సిటిజన్స్ ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు.



# రాగి వేణు మృతి బాధాకరం

- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి,మార్చి31(తెలంగాణ ముచ్చట్లు):**

వనపర్తి పట్టణం 1వ వార్డుకు చెందిన రాగి వేణు మృతి చెందడం అత్యంత బాధాకరమని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు.ఈ సందర్భంగా రాగి వేణు మృతదేహానికి పూలమాలలు వేసి ఎమ్మెల్యే నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడిన ఆయన, ఈ విషాద సమయంలో తాను ఎల్లప్పుడూ అండదండగా ఉంటానని భరోసా ఇచ్చారు.మృతి చెందిన వ్యక్తిని తిరిగి తీసుకురాలేమని, కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వనపర్తి మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, వనపర్తి మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, స్థానిక కౌన్సిలర్ జయశ్రీ చుక్కరాజు, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య, పీసీసీ సభ్యులు శంకర్ ప్రసాద్, నాయకులు ఎస్ఎల్ఎన్ రమేష్, లక్కాకుల సతీష్, స్థానిక కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్‌కు “బండారి రాజిరెడ్డి కారిడార్”గా నామకరణం

- ప్రభుత్వ జి.ఓ. ఎంఎస్ నెం.104పై ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హర్షం

**ఉప్పల్, మార్చి 31 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ నియోజకవర్గానికి కీలకంగా నిలిచే ఉప్పల్ నుంచి నారపల్లి వరకు ఎలివేటెడ్ కారిడార్‌కు “బండారి రాజిరెడ్డి కారిడార్”గా నామకరణం చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ. ఎంఎస్ నెం.104పై ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హర్షం వ్యక్తం చేశారు.ఉప్పల్ రింగ్ రోడ్ వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ నిర్ణయం తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వానికి, సంబంధిత అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల అభిప్రాయాలను గౌరవిస్తూ, ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిన మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి సేవలను స్మరించుకుంటూ ఈ నామకరణం చేయడం అభినందనీయమని అన్నారు.ఈ కారిడార్ నిర్మాణం ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం సహకారం అందించాలని కోరారు.ప్రజల సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల అమలులో తాను నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# వెంకట్ రెడ్డి నగర్ డివిజన్‌కు రూ.1.29 కోట్ల నిధుల మంజూరు

- అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శ్రీకారం
- కాలనీ వాసులకు ప్రొసీడింగ్స్ అందజేసిన పరమేశ్వర్ రెడ్డి

**మల్కాజ్గిరి, మార్చి 31 (తెలంగాణ ముచ్చట్లు)**

మేడ్చల్-మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ అభివృద్ధికి మరోసారి భారీ నిధులు మంజూరయ్యాయి. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడానికి మొత్తం రూ.1 కోటి 29 లక్షల నిధులతో పలు కాలనీలలో పనులు చేపట్టనున్నారు.ఈ నిధుల మంజూరుకు కృషి చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డికి యూత్ కాంగ్రెస్ నాయకులు, కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మంజూరైన నిధులకు సంబంధించిన ప్రొసీడింగ్స్‌ను సత్యానగర్, లక్ష్మి శ్రీకాంత్ నగర్, శ్రీనగర్, బాలకృష్ణ నగర్ కాలనీల అసోసియేషన్ ప్రతినిధులకు అందజేశారు. వెంకట్ రెడ్డి నగర్ డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దే దిశగా కృషి కొనసాగుతున్నదని ఆయన పేర్కొన్నారు.త్వరలోనే మిగతా కాలనీల అభివృద్ధి పనులకు కూడా మరిన్ని నిధులు తీసుకురానున్నట్లు తెలిపారు.మంజూరైన నిధులతో సత్యానగర్ కాలనీలో రూ.24 లక్షలు, లక్ష్మి శ్రీకాంత్ నగర్ కాలనీలో రూ.41 లక్షలు, శ్రీనగర్ కాలనీలో రూ.16 లక్షలు, బాలకృష్ణ నగర్ కాలనీలో రూ.48 లక్షల వ్యయంతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టనున్నారు.ఈ కార్యక్రమంలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## యూనిఫామ్ లను పంపిణి చేసిన ఉప సర్పంచ్

**జఫర్గడ్,మార్చి31, తెలంగాణ ముచ్చట్లు):** మండలం లోని తమ్మడపల్లి జి గ్రామంలో స్థానిక సర్పంచ్ అన్నం స్వప్నబ్రహ్మ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం అంగన్వాడి కేంద్రంలో నిర్వహించిన పిల్లలకు (36 సం.) యూనిఫామ్ ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని పంపిణీ చేసిన స్థానిక ఉప సర్పంచ్ ముక్కెర గంగరాజు అలాగే అనంతరం ECCE రోజు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ అనిత, వార్డ్ సభ్యులు మహమ్మద్ అంకూష్, సొన్నాయిల నాగరాజు, నక్క అజయ్, కూరపాటి విజయ్ కుమార్, గాదె మౌనిక అంబేద్కర్ అంగన్వాడీ టీచర్లు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధ్యాయుడు ధనరాజ్ రణదీవ్‌కు ఘన వీడ్కోలు

**పెద్దమందడి,మార్చి31(తెలంగాణ ముచ్చట్లు):**
వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మద్దిగట్లమోజర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహించిన ఉపాధ్యాయుడు ధనరాజ్ రణదీవ్ ఉద్యోగ విరమణ సందర్భంగా పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువుగారిని స్మరించుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు.పాఠశాలలో ఆయన చేసిన సేవలను ప్రశంసిస్తూ పలువురు ఉపాధ్యాయులు మాట్లాడారు. ధనరాజ్ రణదీవ్ తన సేవా కాలంలో విద్యార్థుల అభివృద్ధికి విశేష కృషి చేసి, పాఠశాల ప్రగతికి తోడ్పడ్డారని తెలిపారు. విద్యార్థులు ఉపాధ్యాయుడు రణదీవ్ పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాతో సత్కరించారు.అలాగే పాఠశాల ప్రాంగణం నుండి ఉపాధ్యాయునిపై పూలు జల్లుతూ భావోద్వేగంగా వీడ్కోలు పలికారు. ఈ క్రమంలో తోటి ఉపాధ్యాయులు కూడా భావోద్వేగానికి గురయ్యారు.అనంతరం ధనరాజ్ రణదీవ్ మాట్లాడుతూ తనకు లభించిన ప్రేమాభిమానాలకు కృతజ్ఞతలు తెలిపారు.విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాలకు చేరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థినీ ,విద్యార్థులు పాల్గొన్నారు.




## ఘనంగా మహాలక్ష్మి పథకం వార్షికోత్సవం వేడుకలు

- **మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో 290.27 కోట్ల లబ్ధిదారులు**
- **ఆల్వాల్‌లో జిల్లా స్థాయి సంబరాలు**

**మేడ్చల్ మల్కాజ్గిరి, మార్చ్ 31 (తెలంగాణ ముచ్చట్లు):** మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని అందిస్తున్న మహాలక్ష్మి పథకం తొలి వార్షికోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా విజయోత్సవ సంబరాలు నిర్వహించగా, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో జిల్లా స్థాయి కార్యక్రమం ఆల్వాల్‌లోని సఖి సెంటర్‌లో ఘనంగా జరిగింది. ఈ పథకం ద్వారా ఇప్పటి వరకు 290.27 కోట్ల మహిళ ప్రయాణికులు లబ్ధి పొందినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమానికి మహిళ ప్రయాణికులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, సమాఖ్య నాయకులు హాజరయ్యారు.
ఈ సందర్భంగా పలువురు మహిళలు ఉచిత బస్సు ప్రయాణం వల్ల తమ దైనందిన జీవితంలో వచ్చిన మార్పులను, ఆర్థికంగా కలిగిన ఉపశమనాన్ని వివరించారు. ఉద్యోగాలు, విద్య, వైద్య అవసరాల కోసం సులభంగా ప్రయాణించగలుగుతున్నామని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మహిళా, శిశు, దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారులు, సీబీపీఓలు, సూపర్‌వైజర్లు, సఖి సిబ్బంది, డీడబ్ల్యుఓ కార్యాలయ సిబ్బంది, డీసీపీయూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# గ్రీన్ హిల్స్ కాలనీలో శరవేగంగా రోడ్ల అభివృద్ధి పనులు

- **కాంగ్రెస్ పాలనలో మౌలిక వసతులకు ప్రాధాన్యం**
- **నెమలి అనిల్ కుమార్**

**మల్లాపూర్, మార్చి 31(తెలంగాణ ముచ్చట్లు)**

ఉప్పల్ నియోజకవర్గం నాచారం సర్కిల్ మల్లాపూర్ డివిజన్ పరిధిలోని గ్రీన్ హిల్స్ కాలనీలో రోడ్డు అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందించేందుకు ఈ పనులు చేపట్టినట్లు కాంగ్రెస్ నాయకుడు నెమలి అనిల్ కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా కొనసాగుతున్నాయని, ప్రతి కాలనీకి అవసరమైన మౌలిక వసతులు కల్పించడం లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి సహకారంతో ఈ పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు.గ్రీన్ హిల్స్ కాలనీలో జరుగుతున్న రోడ్ల పనులు పూర్తయిన తర్వాత ప్రజలకు రవాణా పరంగా గణనీయమైన ఉపశమనం కలుగుతుందని ఆయన చెప్పారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మరిన్ని



అభివృద్ధి కార్యక్రమాలను కూడా త్వరలోనే ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు.ఇదిలా ఉండగా, స్థానికులు ఈ పనులపై సంతోషం వ్యక్తం చేస్తూ, కాలనీలో మరిన్ని మౌలిక వసతులు కల్పించాలని అధికారులను కోరుతున్నారు.

# భవాని నగర్‌లో బాక్స్ డ్రైన్ నిర్మాణానికి వినతి

- **వరద నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కోరిన కాలనీ వాసులు**
- **స్పందించిన ఎమ్మెల్యే**

**నాచారం, మార్చి 31 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ నియోజకవర్గం నాచారం సర్కిల్ డివిజన్ పరిధిలోని భవాని నగర్ కాలనీలో వర్షాకాలంలో తలెత్తుతున్న వరద నీటి సమస్యకు పరిష్కారం చూపాలని స్థానికులు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కోరారు. ఈ మేరకు భవాని నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు వినతిపత్రం సమర్పించారు.ఇటీవల ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత భూగర్భ డ్రైనేజీలు, సిమెంట్ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో పనులు వేగంగా కొనసాగుతున్నాయి.అయినప్పటికీ తార్నాక, వి.ఎస్.టి, స్నేహపురి కాలనీల నుంచి వచ్చే వరద నీరు భవాని నగర్‌లోకి చేరి ఇళ్లలోకి ప్రవేశిస్తోందని కాలనీ వాసులు తెలిపారు.ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా హనుమాన్ టెంపుల్ నుంచి పెద్దనాల వరకు బాక్స్ డ్రైన్ నిర్మించాలని వారు ఎమ్మెల్యేను కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, సమస్యను పరిశీలించి బాక్స్ డ్రైన్ నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మధుసూదన్



రెడ్డి, రాయుడు మధుసూదన్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సాయిజెన్ శేఖర్, మేడల మల్లికార్జున్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ కార్డు దారులకు మూడు నెలల బియ్యం పంపిణీ

- **ఏప్రిల్ 1 నుంచి ఒకేసారి పంపిణీ**
- **22 లక్షలకుపైగా లబ్ధిదారులకు లాభం**

**మెడ్చల్ మల్కాజ్గిరి, మార్చి 31 (తెలంగాణ ముచ్చట్లు):**

మెడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో రేషన్ కార్డు దారులకు మూడు నెలలకు సంబంధించిన సన్న బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయనున్నట్లు జిల్లా మేనేజర్ ఎల్. సుగుణ బాయి తెలిపారు. జిల్లాలోని 6,45,442 రేషన్ కార్డులలో నమోదైన 22,17,063 లబ్ధిదారులకు ఈ సదుపాయం కల్పించనున్నట్లు పేర్కొన్నారు.ప్రతి లబ్ధిదారునికి నెలకు 6 కిలోల చొప్పున మూడు నెలలకు అవసరమైన సన్న బియ్యాన్ని సరఫరా చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. ఇందుకోసం జిల్లాలోని 6 ఎంఎల్ఎస్ పాయింట్ల ద్వారా బియ్యాన్ని ఫెయిర్ ప్రైస్ షాపులకు తరలించి, అక్కడి నుంచి లబ్ధిదారులకు సకాలంలో పంపిణీ చేయడానికి చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. లబ్ధిదారులు ఏప్రిల్ 1వ తేదీ నుండి తమకు సంబంధించిన ఫెయిర్ ప్రైస్ షాపుల వద్ద రేషన్ కార్డు, ఆధార్ వివరాలతో హాజరై మూడు నెలల బియ్యాన్ని ఒకేసారి పొందవచ్చని సూచించారు. పంపిణీ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రత్యేక పర్యవేక్షణ చర్యలు అమలు చేస్తున్నట్లు తెలిపారు.ఎక్కడైనా అక్రమాలు, అదనపు వసూళ్లు లేదా ఇతర సమస్యలు తలెత్తిన పక్షంలో సంబంధిత అధికారులకు వెంటనే సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



# మిషన్ స్కేటింగ్ అకాడమీ ఆధ్వర్యంలో ఓపెన్ స్టేట్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్

- **యువ క్రీడాకారులకు ప్రతిభ చాటుకునే వేదిక**
- **రాష్ట్రాల నుంచి భారీగా పాల్గొనిన స్కేటర్లు**

**దమ్మాయిగూడ, మార్చి 31 (తెలంగాణ ముచ్చట్లు):**

మిషన్ స్కేటింగ్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్‌జీఓఐ ఓపెన్ స్టేట్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా ముగిసింది. ఈ పోటీలకు బెంగళూరు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో స్కేటర్లు పాల్గొని తమ ప్రతిభను అద్భుతంగా ప్రదర్శించారు. విభిన్న వయస్సు విభాగాల్లో నిర్వహించిన పోటీలు ఉత్కంఠభరితంగా సాగి ప్రేక్షకుల







ను ఆకట్టుకున్నాయి. యువ క్రీడాకారులు తమ నైపుణ్యాన్ని చాటుతూ మెరుగైన ప్రదర్శనలు ఇచ్చారు. ఈ టోర్నమెంట్ యువ ప్రతిభకు గొప్ప వేదికగా నిలిచి, భవిష్యత్‌లో ఉన్నత స్థాయిల్లో రాణించేందుకు ప్రేరణనిచ్చింది.టోర్నమెంట్ నిర్వహణలో కోచ్‌లు, తల్లిదండ్రులు, నిర్వాహకులు అందించిన సహకారం విశేషంగా నిలిచింది. వైస్ ప్రెసిడెంట్ అబ్దుల్ ఐజాజ్, జనరల్ సెక్రటరీ అబ్దుల్ అజీజ్, జాయింట్ సెక్రటరీ ఎం.డి ఫయాజ్ సమన్వయంతో పోటీలు సజావుగా నిర్వహించబడ్డాయి.మిషన్ స్కేటింగ్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఛాంపియన్‌షిప్ ఘన విజయంగా నిలిచి, స్కేటర్లలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలను లక్ష్యంగా పెట్టుకుని ముందుకు సాగాలని క్రీడాకారులకు ఈ పోటీలు ప్రేరణగా నిలిచాయి.

# అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభం

- **మాజీ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్**
- **వి.ఎస్.టి కాలనీలో సిమెంట్ రోడ్డు పనుల పరిశీలన**
- **డ్రైనేజీ పూర్తితో పనులకు శ్రీకారం**

**నాచారం, మార్చి 31 (తెలంగాణ ముచ్చట్లు):**
ఉప్పల్ నియోజకవర్గం నాచారం సర్కిల్ డివిజన్ లో మంజూరైన సుమారు రూ.14 కోట్ల అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామని మాజీ కార్పొరేటర్ శాంతి తెలిపారు.వి.ఎస్.టి కాలనీ అమ్మవారి గుడి ముందు వీధి మరియు సమీప వీధుల్లో రూ.20 లక్షల వ్యయంతో చేపట్టిన సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను ఆమె సాయిజెన్ శేఖర్‌తో కలిసి పర్యవేక్షించారు. దాదాపు రెండేళ్ల క్రితం మంజూరైన ఈ రోడ్డు పనులు, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో నిలిచిపోయాయి. ఈ కారణంగా నిధులు కూడా వెనక్కి వెళ్లినట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సహకారంతో మళ్లీ నిధులు మంజూరు చేయించడంతో పాటు సుమారు రూ.10 లక్షల వ్యయంతో భూగర్భ డ్రైనేజీ పనులు పూర్తి చేయించారు. డ్రైనేజీ



పనులు పూర్తవడంతో ప్రస్తుతం సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమైనట్లు తెలిపారు.ఈ పనులు తిరిగి ప్రారంభం కావడంతో స్థానిక బస్తీ వాసులు హర్షం వ్యక్తం చేస్తూ మాజీ కార్పొరేటర్ శాంతిని శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్, సువర్ణ సుగుణాకర్ రావు, రోహిత్, శ్రీనివాస్ రెడ్డి, కట్ట బుచ్చన్న గౌడ్, హనుమంతరావు, బూమ్ రావు తదితరులు పాల్గొన్నారు.

# పంట మార్పిడి వైపు తిమ్మాపూర్ అడుగు రైతులకు కొత్త దారి

**ఎల్కతుర్తి, మార్చి 31( తెలంగాణ ముచ్చట్లు):**

హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం తిమ్మాపూర్ గ్రామంలో వ్యవసాయ రంగంలో మార్పులకు నాంది పలుకుతూ పంట మార్పిడి విధానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామంలోని రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనగా, శాస్త్రవేత్తలతో ముఖాముఖి కార్యక్రమం ఆసక్తికరంగా సాగింది. ఈ కార్యక్రమం ద్వారా రైతులకు కొత్త పంటలపై దృష్టి సారించేలా చైతన్యం కలిగింది.
గ్రామ సర్పంచి ముప్పు మానస మహేందర్ పాల్గొని రైతుల సమస్యలను సమగ్రంగా వివరించారు. హన్మకొండ రైతు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో మృత్తిక శాస్త్రవేత్త డాక్టర్ సి.హెచ్. రాములు (ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, వరంగల్) రైతులకు పంట మార్పిడి ప్రాముఖ్యతను వివరించారు. నేల సారాన్ని కాపాడుకోవడం, దిగుబడులను పెంచుకోవడం



కోసం పంటల మార్పిడి ఎంతో అవసరమని తెలిపారు.
సదస్సులో రైతులు తమ అనుభవాలను పంచుకుంటూ ప్రస్తుతం వరి పంటపై అధికంగా ఆధారపడుతున్నామని తెలిపారు. ప్రభుత్వం వరి ధాన్యాన్ని కొనుగోలు చేయడం, హార్వెస్టర్ సౌకర్యాలు అందుబాటులో ఉండటం వల్ల వరి సాగు సులభమైందని పేర్కొన్నారు. అయితే ఇతర పంటల సాగుకు కార్మిక వ్యయం ఎక్కువగా ఉండటం, మార్కెట్‌లో అనిశ్చితి నెలకొనడం వల్ల ఆర్థిక నష్టాలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల ధరలు పెరుగుతుండటం, వర్షాభావం, నీటి కొరత వంటి సమస్యలు వ్యవసాయాన్ని మరింత క్లిష్టంగా మారుస్తున్నాయని రైతులు తెలిపారు. ఇతర పంటల వైపు మొగ్గు చూపాలంటే ప్రభుత్వం నుంచి సబ్సిడీలు, కనీస మద్దతు ధర (ఎమ్మెస్ పి), మార్కెట్ సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. డాక్టర్ రాములు మాట్లాడుతూ పంట మార్పిడి ద్వారా నేలలో సూక్ష్మ జీవుల సంఖ్య పెరిగి, పోషకాల లభ్యత మెరుగుపడుతుందని వివరించారు. వరి తర్వాత పప్పుధాన్యాలు, నూనెగింజల పంటలు లేదా ఆరుతడి పంటలు వేసినట్లయితే నేల బలం నిల్వ ఉండటంతో పాటు దిగుబడులు కూడా పెరుగుతాయని తెలిపారు. సర్పంచి ముప్పు మానస మహేందర్ మాట్లాడుతూ గ్రామంలో వరి దిగుబడులు క్రమంగా తగ్గుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు మార్పు వైపు అడుగులు వేయాలంటే ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందించాల్సిన అవసరం ఉందని సూచించారు. సేంద్రియ ఎరువుల వినియోగాన్ని పెంచుతూ ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ సదస్సు ద్వారా తిమ్మాపూర్ రైతులు పంట మార్పిడి ప్రాముఖ్యతను గ్రహించి, భవిష్యత్తులో తమ సాగు విధానాల్లో మార్పులు తీసుకురావాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నారు. రైతు-శాస్త్రవేత్తల ఈ సంభాషణ గ్రామ వ్యవసాయానికి కొత్త దిశను చూపిందని చెప్పవచ్చు.



# పదవీ విరమణ పొందిన పోలీస్ అధికారులకు ఘన సన్మానం

- మల్కాజిగిరి సీపీ అవినాష్ మహంతి అభినందనలు
- విశ్రాంత జీవితానికి శుభాకాంక్షలు

**మల్కాజ్గిరి, మార్చ్ 31 (తెలంగాణ ముచ్చట్లు)**

మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో పదవీ విరమణ పొందిన ఏడుగురు పోలీస్ అధికారులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీపీ అవినాష్ మహంతి ఐపీఎస్ పాల్గొని, వారి సేవలను కొనియాడుతూ అభినందనలు తెలిపారు.పదవీ విరమణ పొందిన వారిలో ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన సబ్ ఇన్స్పెక్టర్ కె. కరుణాకర్ రెడ్డి, ఆర్మ్డ్ హెడ్ క్వార్టర్స్‌లో పనిచేసిన రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్ పి. సత్యనారాయణ చారి, అసిస్టెంట్ రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్లు ఎన్. జైరాం, వై. సాయిబాబా, ఏ. మూర్తుజా, అలాగే హోమ్ గార్డ్ అధికారులు కె. పద్మారావు, బి. బాలనర్సమ్మ ఉన్నారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, పోలీసు ఉద్యోగం ఎన్నో సవాళ్లతో కూడుకున్నదని, విధి నిర్వహణలో క్రమశిక్షణతో సేవలందించినందుకు అధికారులను అభినందించారు. పదవీ విరమణ అనంతరం ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని, ప్రశాంతమైన జీవితం గడపాలని సూచించారు. అలాగే పెన్షన్, ఇతర ఆర్థిక ప్రయోజనాలు త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ అడ్మిన్ ఇందిర, సీఏఓ అడ్మిన్ శ్రీనివాస్, చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ శ్రీనివాస్, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు సిహెచ్. భద్రా రెడ్డి, కోఆపరేటివ్ డైరెక్టర్ సువర్ణ, వల రాజు తదితరులు పాల్గొన్నారు.



## మహాలక్ష్మి పథకం మహిళలకు వరంగా మారింది

- కుషాయిగూడలో కార్యక్రమం
- మహిళల పొదుపు రూ.10,000 కోట్లకు చేరింది
- బస్సుల్లో ప్రయాణం గణనీయంగా పెరిగింది

**కుషాయిగూడ, మార్చి 31 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో కుషాయిగూడ డిపో పరిధిలోని ఈసీఐఎల్ బస్టాండ్‌లో మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి హాజరైన మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం మహిళలకు వరంగా మారిందన్నారు. మహిళల సాధికారతను పెంపొందించడంలో ఈ పథకం కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు.కుషాయిగూడ డిపో మేనేజర్ వేణుగోపాల్ మాట్లాడుతూ, గతంలో రవాణా ఖర్చుల కోసం నెలకు రూ.1,500 నుంచి రూ.2,500 వరకు ఖర్చు చేసే మహిళలు, విద్యార్థినులు, కూలీలు ఇప్పుడు ఆ మొత్తాన్ని పొదుపు చేసుకుంటున్నారని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళలు పొదుపు చేసిన మొత్తం రూ.10,000 కోట్లకు చేరుకోవడం ఈ పథకం విజయాన్ని సూచిస్తోందన్నారు. మహాలక్ష్మి పథకం అమలుతో ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగిందని తెలిపారు. పథకం ప్రారంభానికి ముందు 40 శాతం ఉన్న మహిళల వాటా ప్రస్తుతం 67 శాతానికి పైగా పెరిగిందని పేర్కొన్నారు. ప్రతిరోజూ సగటున 35 లక్షల మందికి పైగా మహిళలు ఈ పథకం ద్వారా సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకుంటున్నారని వెల్లడించారు .ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పావని రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ చంద్రమౌళి, కీర్తి కుమార్, హెడ్ కానిస్టేబుల్ లక్ష్మయ్య, రాజేష్ నాయుడు, వెల్ఫేర్ మెంబర్ రాములు, మహేందర్ రెడ్డి, ఎస్బీఐ భగవంతం, డ్రైవర్ ఉపేందర్, కండక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ సిలిండర్ మాయలో బంగారం దోపిడి...
## కందుగులలో కేటుగాళ్ల కుతంత్రం

**హుజురాబాద్ టౌన్ మార్చ్ 31 (తెలంగాణ ముచ్చట్లు):** హుజురాబాద్ మండలం కందుగుల గ్రామంలో కేటుగాళ్లు అమాయక మహిళను మోసం చేసి బంగారం అపహరించిన ఘటన కలకలం రేపింది. "గ్యాస్ సిలిండర్ వచ్చిందని" నమ్మబలికిన దుండగులు చాకచక్యంగా దోపిడీకి పాల్పడ్డారు.

గ్రామానికి చెందిన గుడిపాటి ఆగమ్మను ఒక వ్యక్తి ఇంటి బయటకు తీసుకెళ్లి, సిలిండర్ విషయమై మాట్లాడుతున్నట్టు నటించాడు. అదే సమయంలో మరో వ్యక్తి ఇంట్లో ఎవరూ లేరని గమనించి లోపలికి వెళ్లి సుమారు నాలుగున్నర తులాల బంగారాన్ని అపహరించాడు. కొద్దిసేపటికే తిరిగి వచ్చిన ఆగమ్మకు ఇంట్లో దోపిడి జరిగిన విషయం తెలిసి షాక్‌కు గురైంది.




బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనలో పాల్గొన్న వ్యక్తులు గుర్తు తెలియని వారు కావడంతో వారి కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు.

ఈ సందర్భంగా పోలీసులు ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచితుల మాటలు నమ్మకూడదని, ముఖ్యంగా ఇలాంటి మోసపూరిత పద్ధతుల పట్ల జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ఈ సంఘటనతో కందుగుల గ్రామంలో భయాందోళన నెలకొంది.

# మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ దాడులు

- సిబ్బందిపై నిఘా.. రికార్డుల సోదాలు
- పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి

**సత్తుపల్లి, మార్చి 31 (తెలంగాణ ముచ్చట్లు):**

సత్తుపల్లి పట్టణం మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఏసీబీ అధికారులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఉదయం ప్రారంభమైన తనిఖీలు గంటల పాటు కొనసాగాయి. కార్యాలయంలో ఉన్న సిబ్బందిని బయటకు అనుమతించకుండా నియంత్రణలు విధించి, కీలక విభాగాల రికార్డులను పరిశీలించారు. నగదు లావాదేవీలు, పన్ను వసూళ్లు, ఫైళ్ల నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించినట్లు సమాచారం. కొంతకాలంగా అందుతున్న ఫిర్యాదుల మేరకు ఈ తనిఖీలు చేపట్టినట్లు తెలిసింది. ఏసీబీ డీఎస్పీ వై. రమేష్ మాట్లాడుతూ, ఫిర్యాదుల ఆధారంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని, ఉద్యోగుల పనితీరును కూడా పరిశీలిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వానికి రావాల్సిన పన్నుల వసూళ్లలో లోపాలున్నాయన్న అనుమానాలపై దృష్టి పెట్టినట్లు పేర్కొన్నారు. అధికారులు పలు విభాగాల రికార్డులను సవివరంగా పరిశీలించగా, అవసరమైతే సంబంధిత సిబ్బందిని విచారణకు పిలిపించే అవకాశం ఉందని సమాచారం. ఇదిలా ఉండగా, మున్సిపల్ కమిషనర్ కె. నరసింహ రావు నివాసంలో కూడా ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ ఘటనతో మున్సిపల్ కార్యాలయంలో ఉద్రిక్తత నెలకొనగా, స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.






# హాట్‌స్పాట్లపై ఏసీపీ దృష్టి.!

- ప్రమాదాల నియంత్రణకు చర్యలు
- 'అరైవ్ అలైవ్' అవగాహన

**కల్లూరు, మార్చి 31(తెలంగాణ ముచ్చట్లు):**

రోడ్డు ప్రమాదాల నియంత్రణపై కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ ప్రత్యేక దృష్టి సారించారు. వి.ఎం. బంజర్ పోలీస్ స్టేషన్ పరిధిలో తరచూ ప్రమాదాలు చోటుచేసుకునే హాట్‌స్పాట్లను ఆమె మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు, మున్సిపల్ ప్రతినిధులు, ఇతర శాఖల అధికారులతో కలిసి పరిస్థితులను సమీక్షించారు. రింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన రంబుల్ స్ట్రిప్స్‌ను పరిశీలించిన ఆమె, గ్రీన్ ఫీల్డ్ హైవే వైపు వెళ్లే వాహనాల వేగ నియంత్రణకు సర్వీస్ రోడ్లపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. రోడ్ల స్పష్టత కోసం ఇరువైపులా ఉన్న పొదలను తొలగించారు. అనంతరం 'అరైవ్ అలైవ్' ప్రచార కార్యక్రమంలో భాగంగా స్థానికులతో సమావేశం నిర్వహించారు. హెల్మెట్ వినియోగం,



ట్రాఫిక్ నిబంధనల పాటింపు అత్యవసరమని తెలిపారు. కుటుంబాల భద్రత దృష్ట్యా ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా వాహనాలు నడపాలని, సురక్షితంగా ఇంటికి చేరుకోవాలని పిలుపునిచ్చారు. డివిజన్‌లో వివిధ శాఖల సమన్వయంతో అవగాహన కార్యక్రమాలు కొనసాగుతున్నాయని, రోడ్డు భద్రతకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

## ఉచిత పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి:ఉప సర్పంచ్ ముక్కెర గంగరాజు

జఫర్గడ్, మార్చి31,(తెలంగాణ ముచ్చట్లు) మండలం లోని తమ్మడపల్లి జి గ్రామంలో స్థానిక సర్పంచ్ అన్నం స్వప్నబ్రహ్మారెడ్డి ప్రత్యేక చొరవతో పశు వైద్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరంలో స్థానిక ఉప సర్పంచ్ ముక్కెర గంగరాజు పాల్గొని పశువులకు గాలి కుంటు వ్యాధి నిరోధక టీకాలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు.తదుపరి వారు మాట్లాడుతూ.. రైతులు అంతా ఉచిత పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకుని, పశువులను గాలి కుంటు వ్యాధి బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో స్టేషన్ ఘనపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ గుజ్జరి రాజు, మండల పశు వైద్య అధికారి డా.రజిత, సహాయ సంచాలకులు డా.సారంగపాణి, గోపాల మిత్రలు చిలువేరు నగేష్, సాంబరాజు దివ్య, వార్డ్ సభ్యులు మహమ్మద్ అంకుష్, కూరపాటి విజయ్ కుమార్, మందపూరి వాణినవీన్, రైతులు వేల్పుల రవి, నరేష్, రాజహంస , ఎల్లూస తదితరులు పాల్గొన్నారు.



## ఉప్పల్ కూరగాయల మార్కెట్‌లో స్వచ్ఛమైన మంచినీటి సౌకర్యం

- రూ.11 లక్షలతో ప్యూరిఫైడ్ వాటర్ ఫిల్టర్ ఏర్పాటు
- మాజీ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి ప్రారంభం

**ఉప్పల్, మార్చి 31 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ కూరగాయల మార్కెట్‌లో వ్యాపారులు, వినియోగదారుల కోసం స్వచ్ఛమైన మంచినీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. రూ.11 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ప్యూరిఫైడ్ వాటర్ ఫిల్టర్‌ను మాజీ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి స్థానిక చిన్న వ్యాపారులతో కలిసి ప్రారంభించారు .ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గత ఎన్నికల సమయంలో సీఎం రేవంత్ రెడ్డి





ఇచ్చిన హామీ మేరకు మార్కెట్‌లో తాగునీటి సమస్యను పరిష్కరించామని తెలిపారు. రోజూ వందలాది మంది వచ్చే ఈ మార్కెట్‌లో మంచినీటి సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ వాటర్ ఫిల్టర్ ద్వారా ఆ సమస్యకు పరిష్కారం లభించిందన్నారు.చిన్న వ్యాపారులు, వినియోగదారులకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉండబోతుందని పేర్కొన్నారు. అంతేకాకుండా, ఈ ఫిల్టర్ నిర్వహణ బాధ్యతలను మహిళా పొదుపు సంఘాలకు అప్పగించడం ద్వారా వారికి ఉపాధి అవకాశాలు కల్పించామని చెప్పారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, వ్యాపారులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## హుజురాబాద్‌కు మరిన్ని బస్సులు... రవాణా సదుపాయాల కోసం ప్రణవ్ వినతి

**హుజురాబాద్ టౌన్ మార్చ్ 31 (తెలంగాణ ముచ్చట్లు):** హుజురాబాద్ పట్టణం మరియు పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన రవాణా సదుపాయాలు కల్పించాలని కాంగ్రెస్ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన హైదరాబాద్‌లో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు.

ప్రస్తుతం కొన్ని మార్గాల్లో మాత్రమే బస్సు సర్వీసులు నడుస్తున్నాయని, అయితే పలు గ్రామాలు ఇంకా సరైన రవాణా సదుపాయాల కోసం ఎదురుచూస్తున్నాయని



ప్రణవ్ వివరించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారని, అందుకే కొత్త మార్గాల్లో బస్సు సర్వీసులు ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు.

అదేవిధంగా హుజురాబాద్ డిపో అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కూడా కోరారు. డిపో బలోపేతం అయితే మరిన్ని సర్వీసులు అందుబాటులోకి వస్తాయని ఆయన పేర్కొన్నారు. ప్రణవ్ వినతిపై మంత్రి పొన్నం ప్రభాకర్ సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. త్వరలోనే సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు తెలిసింది.

ఈ పరిణామంతో హుజురాబాద్ ప్రాంత ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

# ఘనంగా మహావీర్ జయంతి వేడుకలు

- ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొని అహింసా సిద్ధాంతం ప్రాముఖ్యతపై సందేశం

**సికింద్రాబాద్, మార్చి 31 (తెలంగాణ ముచ్చట్లు):** మహావీర్ జయంతి సందర్భంగా సికింద్రాబాద్‌లో జైన సమాజం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ, ఈ సంవత్సరం 2625వ మహావీర్ జయంతిని జరుపుకుంటున్నామని తెలిపారు. సమాజానికి మార్గదర్శకులైన మహాపురుషుల బోధనలు నేటికీ ఎంతో ప్రాసంగికమని పేర్కొన్నారు."సర్వేజనా సుఖినోభవంతు" అనే భారతీయ ఆలోచన ప్రపంచానికి ఆదర్శమని, కానీ కొందరు విధ్వంసక భావజాలంతో శాంతి భద్రతలను భంగం చేస్తున్నారని అన్నారు.మహావీరుడు బోధించిన అహింసా సిద్ధాంతాన్ని అనుసరించి మహాత్మా గాంధీ దేశానికి స్వాతంత్ర్యం సాధించారని గుర్తు చేశారు. ప్రస్తుత కాలంలో నరేంద్ర మోడీ కూడా అదే మార్గాన్ని అనుసరిస్తున్నారని చెప్పారు.అహింసా మార్గాన్ని ప్రతి ఒక్కరూ పాటిస్తేనే "సారే జహాసే అచ్చా" అనే నినాదం సార్థకమవుతుందని తెలిపారు. మహావీర్ జయంతిని ఘనంగా నిర్వహించిన జైన సమాజానికి ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ జి .చంద్రశేఖర్ , మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, మైనారిటీ మోర్చా అధ్యక్షుడు జగ్ మోహన్ సింగ్, కంటోన్మెంట్ బోర్డు సభ్యురాలు నర్మదా మల్లికార్జున్, సంపత్, పరాగ్, విజయ్, పవన్‌తో పాటు జైన సమాజ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.






తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# సేవలకు సెల్యూట్.. జమ్మికుంట మున్సిపల్‌లో నలుగురికి హృదయపూర్వక వీడ్కోలు



**జమ్మికుంట టౌన్ మార్చ్ 31 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట మున్సిపల్ కార్యాలయం భావోద్వేగాలతో నిండిపోయింది. ఎన్నో సంవత్సరాల సేవల అనంతరం గాజుల ఎల్లయ్య, బూడిద సారయ్య, దొడ్డే మొగిలి, గుల్లి మొగిలి పదవీ విరమణ పొందగా, వారికి ఘనంగా వీడ్కోలు పలికారు.

ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) మాట్లాడుతూ, "మీ సేవలు జమ్మికుంట అభివృద్ధిలో చిరస్థాయిగా నిలుస్తాయి. మీరు చేసిన కృషి మున్సిపల్ చరిత్రలో ఒక ప్రత్యేక అధ్యాయం" అని కొనియాడారు. ఇకపై కూడా అవసరమైనప్పుడు తాను ఎల్లప్పుడూ మీకు, మీ కుటుంబాలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

తన కుటుంబం తరతరాలుగా మున్సిపల్ సేవలతో అనుబంధం కలిగి ఉందని గుర్తుచేసుకుంటూ, "ఇది కేవలం ఉద్యోగ సంబంధం కాదు… ఒక కుటుంబ బంధం" అని భావోద్వేగంగా అన్నారు.

పదవీ విరమణ పొందిన ఉద్యోగులను శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలతో సత్కరించి, వారి సేవలను స్మరించుకున్నారు. సహచరులు, అధికారులు వారికి శుభాకాంక్షలు తెలుపుతూ, వారి ఆరోగ్యం, సంతోషకరమైన జీవితాన్ని కోరుకున్నారు.

ఈ కార్యక్రమంలో కమిషనర్ యండి ఆయాజ్, వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్, కౌన్సిలర్లు శీలం శ్రీనివాస్, పొనగంటి రాము, మాచెర్ల రాజు, కోలుగురి సురేష్, కూతడి తిరుపతి, పొనగంటి విష్ణు, బత్తుల లక్ష్మణ్, దిడ్డి రాము, మంద రాజేష్, మైస రవి తదితరులు పాల్గొని, వీడ్కోలు కార్యక్రమాన్ని మరింత గౌరవప్రదంగా చేశారు. ఈ వీడ్కోలు వేడుక జమ్మికుంట మున్సిపల్ కుటుంబంలోని అనుబంధాన్ని మరోసారి చాటిచెప్పింది.






# కుషాయిగూడ డిపోలో టీజీఎస్ఆర్టీసీ బీసీ యూనియన్ కొత్త కమిటీ

- పనగట్ల చక్రపాణి గౌడ్ అధ్యక్షుడిగా ఎన్నిక
- ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉంటానన్న తీన్మార్ మల్లన్న

**కుషాయిగూడ, మార్చి 31 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) బీసీ ఎంప్లాయిస్ యూనియన్ వెల్ఫేర్ అసోసియేషన్ కుషాయిగూడ డిపోకు నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పనగట్ల చక్రపాణి గౌడ్‌ను అధ్యక్షుడిగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షుడు, టీజీఎస్ఆర్టీసీ బీసీ ఎంప్లాయిస్ యూనియన్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తీన్మార్ మల్లన్న హాజరయ్యారు. ఆయన కుషాయిగూడ డిపో మేనేజర్ వేణుగోపాల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి, నూతనంగా ఎన్నికైన సభ్యులను పరిచయం చేశారు. ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఉద్యోగులకు ఎటువంటి సమస్యలు వచ్చినా యాజమాన్యంతో చర్చించి పరిష్కారం సాధిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బండారపు నర్సయ్య, రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి వీరమల్ల అనిల్ పటేల్, రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్, జిల్లా యువత అధ్యక్షుడు సింగం అరుణ్ పటేల్, జిల్లా మహిళా అధ్యక్షురాలు నీరుడు శాలిని, జిల్లా నాయకులు, యువజన ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమ నిర్వాహకులుగా ఆర్టీసీ బీసీ యూనియన్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సి.హెచ్. సంపత్ ముదిరాజ్, జనరల్ సెక్రటరీ పొన్న హరికిషన్, జాయింట్ సెక్రటరీ సాజిద్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి దుర్గేష్ గౌడ్, కార్యదర్శులు శోకం వెంకన్న, యాదగిరి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగ పదవి విరమణ పొందిన కనకం పున్నం చందర్‌కు అభినందన సభ



**హనుమకొండ, మార్చి 31 (తెలంగాణ ముచ్చట్లు):** జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా 37 సంవత్సరాలు సేవలందించిన కనకం పున్నం చందర్ పదవి విరమణ సందర్భంగా అభినందన సభ నిర్వహించారు. ఆయన 30032026న పదవి విరమణ పొందారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ బి. రవి కుమార్ మాట్లాడుతూ, పున్నం చందర్ మృదుస్వభావి, నిగర్వి, నిస్వార్థపరుడిగా పనిచేశారని పేర్కొన్నారు. పర్వతగిరి, చన్నారోపేట్, నెక్కొండ మండలాల్లో సేవలందిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించారని తెలిపారు. ఆయన భవిష్యత్తు జీవితం సుఖసంతోషాలతో నిండాలని ఆకాంక్షించారు. అభినందన సభలో చంద్రుగొండ ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు కె. కృష్ణారావు, ఎల్. సునీల్, వి. శ్రీనాథ్, సరిత, మమత, పవన్ కుమార్, రంజిత్ కుమార్, అనిత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు పున్నం చందర్‌ను శాలువాతో సత్కరించి, మెమెంటో అందజేసి, ప్రశంసాపత్రం సమర్పించారు.

# కరెంట్ షాక్‌తో క్యాజువల్ కార్మికుడి మృతి



- మృతదేహంతో కుటుంబ సభ్యుల ఆందోళన

**హనుమకొండ, మార్చి 31 (తెలంగాణ ముచ్చట్లు):** గ్రేటర్ వరంగల్ ఎన్పిడిసిఎల్ పరిధిలో హనుమకొండ యాదవ్ నగర్ యూనిట్‌లో క్యాజువల్ కట్టర్‌గా పనిచేస్తున్న గాదె పున్నం చందర్ కరెంట్ షాక్‌తో మృతి చెందాడు. గుండ్లసింగారం బీసీ కాలనీలో మరమ్మతుల పనుల సందర్భంగా ఈ ఘటన చోటుచేసుకుంది. సమాచారం ప్రకారం, సోమవారం విద్యుత్ సరఫరా కొనసాగుతున్న సమయంలోనే మరమ్మతుల పేరుతో పున్నం చందర్‌ను విద్యుత్ స్థంభం ఎక్కించారు. ఈ క్రమంలో అకస్మాత్తుగా కరెంట్ షాక్ తగలడంతో కిందపడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. అనంతరం నగరంలోని ఒక ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన కుటుంబ సభ్యులు, బంధువులు నక్కలగుట్టలోని విద్యుత్ భవన్ ఎదుట మృతదేహంతో ఆందోళనకు దిగారు. నిర్లక్ష్యంతోనే ఈ ప్రమాదం జరిగిందని ఆరోపిస్తూ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతుడి కుటుంబానికి కోటి రూపాయల ఆర్థిక సాయం అందించడంతో పాటు భార్యకు ఉద్యోగం కల్పించాలని కోరారు. అలాగే ఈ ఘటనకు కారణమైన అధికారులను సస్పెండ్ చేయాలని, పూర్తి నష్టపరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు.

# టీఎన్జీవోస్ కేంద్ర సంఘం ఉపాధ్యక్షుడిగా రామునాయక్‌కు మరోసారి బాధ్యతలు

**హైదరాబాద్, మార్చి31 (తెలంగాణ ముచ్చట్లు):** టీఎన్జీవోస్ కేంద్ర సంఘం ఉపాధ్యక్షుడిగా రామునాయక్ రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. సంఘ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొంటూ నిరంతరం సేవలందిస్తూ, సభ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న నేపథ్యంలో ఈ బాధ్యతలను మరోసారి అప్పగించారు.




ఈ సందర్భంగా బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు రామునాయక్‌ను అభినందించారు. వి.ఎన్ నాయక్ బృందం, అర్పిత నాయక్, అనసూయ, రామన్న నాయక్, భర్తీయా నాయక్, లక్ష్మణ్ నాయక్, జవహర్లాల్ నాయక్, భూక్య శ్రవణ్ కుమార్, రాజు నాయక్, హేమా నాయక్, రమేష్, కిషన్ నాయక్, వీరన్న నాయక్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. రామునాయక్ నాయకత్వంలో సంఘం మరింత బలపడాలని వారు ఆకాంక్షించారు.




# నేషనల్ ఆర్చరీ పోటీలో చక్రి నికిత్‌కు సిల్వర్ మెడల్

_గుంటూరులో మెరిసిన 9 ఏళ్ల బాలుడు
– స్ఫూర్తి గ్రూపు అభినందనలు

**ఏ ఎస్ రావు నగర్, మార్చి 31 (తెలంగాణ ముచ్చట్లు):** గుంటూరులోని వివిఐటి, నంబూరులో నిర్వహించిన నేషనల్ స్థాయి ఆర్చరీ పోటీల్లో మాస్టర్ చక్రి నికిత్ సిల్వర్ మెడల్ సాధించి విశేష ప్రతిభ కనబరిచాడు. కమలానగర్‌కు చెందిన చక్రి నికిత్ ఈసీఐఎల్ కొండాపూర్ సొసైటీ డైరెక్టర్ ద్వారకానాథ్ మనవడు. రాక్ హుడ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఐదవ తరగతి చదువుతున్న 9 ఏళ్ల ఈ బాలుడు తల్లిదండ్రులు సోనా ఘోష్, ఏ. క్రాంతి కుమార్. గతంలో పలు పోటీల్లో ప్రథమ స్థానాలు సాధించి నేషనల్ స్థాయి పోటీలకు అర్హత పొందిన చక్రి నికిత్, ఈ పోటీల్లోనూ అద్భుత ప్రతిభతో సిల్వర్ మెడల్ గెలుచుకున్నాడు. ఈ సందర్భంగా చక్రి నికిత్ విజయాన్ని స్ఫూర్తి గ్రూపు సభ్యులు అభినందించారు. బాధ్యులు గొడుగు యాదగిరిరావు మాట్లాడుతూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.



# జమ్మికుంట రూరల్ పోలీస్ స్టేషన్‌పై అదనపు డీసీపీ ఆకస్మిక తనిఖీ

**జమ్మికుంట టౌన్ మార్చ్ 31 (తెలంగాణ ముచ్చట్లు):** కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని జమ్మికుంట రూరల్ పోలీస్ స్టేషన్‌ను అదనపు డీసీపీ (అడ్మిన్) పి. వెంకటరమణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్టేషన్‌లోని కార్యాలయ నిర్వహణ, కేసుల రికార్డులు, ఫైళ్ల నిర్వహణ విధానాన్ని సమగ్రంగా పరిశీలించారు. రికార్డులు క్రమబద్ధంగా నిర్వహించబడుతున్నాయని గుర్తించిన ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సీఐ కె. లక్ష్మీనారాయణతో మాట్లాడి, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించే దిశగా పోలీస్ సిబ్బంది కృషి చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌లో పారదర్శకత, సమయపాలన, బాధ్యతాయుతమైన విధానాలు పాటించాలని ఆయన పేర్కొన్నారు. తనిఖీ అనంతరం స్టేషన్ ప్రాంగణంలో మొక్క నాటడం ద్వారా పర్యావరణ పరిరక్షణపై తన కట్టుబాటును చాటారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ మాధవి, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



# మహిళల ఉచిత ప్రయాణంతో ఆర్టీసీకి పునర్జీవం

-- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి, మార్చి3 (తెలంగాణ ముచ్చట్లు):** మహిళల ఆర్థిక స్వావలంబనను లక్ష్యంగా పెట్టుకుని ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ప్రయాణ పథకం ద్వారా ఆర్టీసీకి పునర్జీవం వచ్చిందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తెలిపారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా వనపర్తి బస్టాండ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత రెండు సంవత్సరాల్లో ఆర్టీసీ బస్సుల్లో సుమారు 290 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించారని, దీనివల్ల ఆర్టీసీకి దాదాపు పదివేల కోట్ల రూపాయల ఆదాయం సమకూరిందని ఆయన పేర్కొన్నారు. మహిళల భాగస్వామ్యంతో ఆర్టీసీ లాభాల బాటలో నడుస్తోందని తెలిపారు.

మహిళా సంఘాల ద్వారా అద్దె బస్సులను ప్రవేశపెట్టి నెలకు సుమారు 70 వేల రూపాయల ఆదాయం పొందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని, దీని ద్వారా మహిళలు ఆర్థికంగా బలపడుతున్నారని ఆయన అన్నారు. రాబోయే రోజుల్లో ప్రతి గ్రామానికి ఆర్టీసీ బస్సులు వెళ్లేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. గత పాలనలో ఆర్టీసీ దుర్భర స్థితిలో ఉండగా, ప్రస్తుతం ప్రభుత్వం ఉద్యోగులను ఆదరిస్తూ సంస్థను లాభాల దిశగా నడిపిస్తోందని పేర్కొన్నారు. మహిళల గౌరవం, ఆర్థిక అభివృద్ధి కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని స్పష్టం చేశారు. వనపర్తి పట్టణ శివారులో ఇరవై ఎకరాల్లో కొత్త డిపో నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని, ప్రస్తుత డిపో స్థలాన్ని వాణిజ్య అవసరాలకు వినియోగించే యోచనలో ఉన్నామని తెలిపారు. బస్టాండ్ అభివృద్ధి పనులకు కోట్ల రూపాయల నిధులు మంజూరై ఉన్నాయని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ ఉపాధ్యక్షుడు మధు గౌడ్, మహిళా సంఘాల ప్రతినిధులు, ఆర్టీసీ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం అందంచిన సర్పంచ్ బిల్లా

- మృతుడి కుటుంబ సభ్యులకు పరామర్శ

**వేలేరు, మార్చి 31 (తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండల కేంద్రానికి చెందిన నిరుపేద కుటుంబ సభ్యుడు సారా శ్రీనివాస్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. ఈ నేపథ్యంలో ఆయన కుటుంబాన్ని పరామర్శించిన వేలేరు మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు, వేలేరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బిల్లా యాదగిరి ఆర్థిక సహాయంగా రూ.5,000 అందజేశాడు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుటుంబానికి ఆధారమైన వ్యక్తి మృతి చెందడం దురదృష్టకరమని పేర్కొంటూ, భవిష్యత్తులో ప్రభుత్వ పరంగా సహాయం అందించే ప్రయత్నం చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీకర్, గౌడ కుల సంఘం అధ్యక్షుడు కుమార్, సంఘ పెద్దలు చిరంజీవి, రమేష్, వెంకటేశ్, వీరన్న, లక్ష్మీనారాయణ, రవి, రాజశేఖర్, శ్రీను, అలాగే గ్రామ పెద్దలు రాజయ్య, సునీల్, చంద్రమౌళి తదితరులు పా

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# ఇరాన్ ఎందుకు లక్ష్యంగా మారింది?

## (విద్వేషం, చమురు, ఆధిపత్య రాజకీయాల అసలు కథ)

రచన: కె. బి. ధర్మ ప్రకాశ్
కన్వీనర్, పర్యావరణ ఉపసంఘం, జన విజ్ఞాన వేదిక, తెలంగాణ




ప్రపంచ రాజకీయాల్లో యుద్ధాలు, ఆంక్షలు, ప్రచారాలు చాలా సార్లు శాంతి కోసం కాదు; వనరుల కోసం, మార్కెట్ల కోసం, ఆధిపత్యం కోసం నడుస్తాయి. ఇరాన్‌పై ప్రపంచ శక్తుల వైఖరి ఈ వాస్తవాన్ని స్పష్టంగా గుర్తు చేస్తోంది.

ఇరాన్ గురించి అంతర్జాతీయ మీడియా తరచూ "అణు ముప్పు", "అస్థిరత", "ప్రాంతీయ ఉద్రిక్తత" వంటి పదాలతో కథనాలు నడిపిస్తుంది. కానీ ప్రజలు అడగాల్సిన అసలు ప్రశ్న: ఇరాన్‌పై ఇంత ఒత్తిడి ఎందుకు?

సమాధానం — చమురు, సహజవాయువు, వ్యూహాత్మక స్థానం, స్వతంత్ర రాజకీయ వైఖరి.

ఇరాన్ ప్రపంచంలో కీలకమైన ఇంధన వనరుల దేశం. చమురు నిల్వలు, సహజవాయువు సంపద, మధ్యప్రాచ్యంలోని భౌగోళిక ప్రాధాన్యం దానిని ప్రపంచ శక్తుల దృష్టిలో ఎప్పటికీ ఒక కేంద్రంగా నిలబెడుతున్నాయి. ముఖ్యంగా హోర్ముజ్ జలసంధి ప్రపంచ చమురు రవాణాకు జీవనాడిలాంటిది. అందుకే ఇరాన్‌పై ఒత్తిడి కేవలం ఒక దేశ రాజకీయ సమస్య కాదు; అది ప్రపంచ ఇంధన రాజకీయాలపై నియంత్రణ కోసం జరిగే పోరు.

ప్రజాస్వామ్యం, మానవహక్కులు, ప్రపంచ భద్రత వంటి పదాలు తరచూ అంతర్జాతీయ జోక్యాలకు న్యాయపరమైన ముసుగులుగా ఉపయోగించబడుతున్నాయి. ఇవి పూర్తిగా అబద్ధాలు కావాల్సిన అవసరం లేదు. కానీ ప్రశ్న ఏమిటంటే — అదే ప్రమాణాలు అందరికీ ఎందుకు వర్తించవు?

కొన్ని దేశాలపై మాత్రమే కఠిన వైఖరి, ఇంకొన్నింటిపై నిశ్శబ్దం — ఇదే ప్రపంచ రాజకీయాల ద్వంద్వ వైఖరి.

ఇరాన్ సమస్యను చాలాసార్లు మతపరమైన కోణంలో మాత్రమే చూపిస్తారు. కానీ అసలు విషయం మరింత లోతైనది. ఇది మార్కెట్ యుద్ధం కూడా.

ఎవరు చమురు ధరలను ప్రభావితం చేస్తారు? ఎవరు సరఫరా మార్గాలను నియంత్రిస్తారు? ఎవరు ప్రపంచ వాణిజ్య వ్యవస్థను ఆధీనంలో ఉంచాలి?

ఈ ప్రశ్నల చుట్టూ ప్రపంచ రాజకీయాలు తిరుగుతున్నాయి.

ఇరాన్ వంటి దేశం స్వతంత్ర నిర్ణయాలు తీసుకుంటే, పెద్ద శక్తులకు అది అసౌకర్యంగా మారుతుంది. అప్పుడు ఆర్థిక ఆంక్షలు, దౌత్య ఒత్తిళ్లు, మీడియా దుష్ప్రచారం, సైనిక బెదిరింపులు పెరుగుతాయి.

కానీ ఈ చర్యల అసలు బరువును మోయేది ప్రభుత్వాలు కాదు — సాధారణ ప్రజలే.

ఆంక్షల వల్ల దెబ్బతినేది ఎవరు?

పేద కుటుంబాలు, విద్యార్థులు, చిన్న వ్యాపారులు, రోగులు, ఉద్యోగార్థులు.

అంటే "శిక్ష" పేరుతో అమలు చేసే ఆంక్షలు చాలా సందర్భాల్లో ప్రజలపై ఆర్థిక యుద్ధంగా మారుతున్నాయి.

యుద్ధం ప్రకటించేది నాయకులు. ఆయుధాలు అమ్మేది కార్పొరేట్లు. భయాన్ని అమ్మేది మీడియా. కానీ చనిపోయేది, బతుకు బండిని లాగేది, శరణార్థులవేది — ప్రజలే. అందుకే యుద్ధాల వెనుక ఉన్న లాభ రాజకీయాలను ప్రశ్నించడం అవసరం.

ఈ రోజుల్లో యుద్ధం కేవలం ఆయుధాలతో కాదు, కథనాలతో కూడా జరుగుతోంది. ఒక దేశాన్ని శత్రువుగా చూపించాలంటే దాని చరిత్రను కత్తిరిస్తారు, దాని వాదనను దాచేస్తారు, ప్రజలను ఒకే కోణంలో చూపిస్తారు.

అందుకే ప్రజలకు ఇప్పుడు అత్యవసరం — వార్తలను వినడమే కాదు, విశ్లేషించడం.

ఇరాన్ కథ మనకు ఒక పెద్ద పాఠం చెబుతోంది:

వనరులున్న దేశాలు ఎప్పుడూ ఒత్తిడికి గురవుతాయి. ప్రపంచ రాజకీయాల్లో న్యాయం సమానంగా ఉండదు. ప్రజలు జాగృతంగా లేకపోతే ప్రచారం నిజమైపోతుంది.

కాబట్టి ఇరాన్ గురించి మాట్లాడేటప్పుడు కేవలం ఒక దేశాన్ని కాదు, ప్రపంచాన్ని నడిపిస్తున్న ఆధిపత్యం, చమురు రాజకీయాలు, ద్వంద్వ నైతికత, మీడియా నియంత్రణను చూడాలి. ప్రజలు మేల్కొనాలి. ప్రచారాన్ని ప్రశ్నించాలి. వాస్తవాన్ని తెలుసుకోవాలి. ఎందుకంటే చివరికి ప్రపంచాన్ని కాపాడేది ఆయుధాలు కాదు — అవగాహన. "ఇరాన్‌పై ఆగ్రహం కంటే, దాని వనరులపై ఆధిపత్యమే ప్రపంచ రాజకీయాల అసలు లక్ష్యం".

---

# హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్‌కు ఆదాయంలో వృద్ధి



- 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.32,250 కోట్ల ఆదాయం
- గత ఏడాదితో పోలిస్తే పెరిగిన ఆదాయం
- రక్షణ రంగంలో సంస్థ పనితీరు మెరుగుదల

**న్యూఢిల్లీ, మార్చి 31 (తెలంగాణ ముచ్చట్లు):** భారత ప్రభుత్వ రంగ సంస్థ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్‌ఏఎల్) 2025 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆదాయ వివరాలను వెల్లడించింది. మార్చి 31, 2026తో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి రూ.32,250 కోట్ల ఆదాయం (తాత్కాలిక, ఆడిట్ చేయని గణాంకాలు) నమోదైనట్లు తెలిపింది. గత ఆర్థిక సంవత్సరంలో సంస్థ రూ.30,981 కోట్ల ఆదాయం నమోదు చేసిన విషయం తెలిసిందే. దీనితో పోలిస్తే ఈ ఏడాది ఆదాయం గణనీయంగా పెరిగింది. రక్షణ, ఏరోస్పేస్ రంగాల్లో సంస్థ పనితీరు మెరుగుపడటంతో ఈ వృద్ధి సాధ్యమైనట్లు తెలుస్తోంది.

దేశీయ రక్షణ తయారీ రంగంలో హెచ్‌ఏఎల్ కీలక పాత్ర పోషిస్తోంది. స్వదేశీ సాంకేతికతతో విమానాలు, హెలికాప్టర్లు తయారు చేయడంలో సంస్థ ముందంజలో ఉంది. ప్రభుత్వ 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యానికి అనుగుణంగా సంస్థ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం భారత రక్షణ అవసరాలను తీర్చడమే కాకుండా, అంతర్జాతీయ మార్కెట్లలో కూడా హెచ్‌ఏఎల్ తన స్థాయిని పెంచుకునే దిశగా అడుగులు వేస్తోంది. ఎగుమతులు, కొత్త ప్రాజెక్టులు సంస్థ ఆదాయాన్ని మరింత పెంచుతున్నాయి.

ఈ వృద్ధి సంస్థ సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. భవిష్యత్తులో మరింత విస్తరణ, సాంకేతిక అభివృద్ధి ద్వారా హెచ్‌ఏఎల్ మరింత పురోగతి సాధించే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు. ఆడిట్ అనంతరం తుది గణాంకాలు వెల్లడించనున్నట్లు సంస్థ తెలిపింది. ప్రస్తుతం వెల్లడించిన ఆదాయం తాత్కాలికంగా ఉందని స్పష్టం చేసింది.

---

# వొడాఫోన్ ఐడియా 5జీ విస్తరణ

**న్యూఢిల్లీ, మార్చి 31 (తెలంగాణ ముచ్చట్లు):**

ప్రముఖ టెలికాం సంస్థ వొడాఫోన్ ఐడియా దేశవ్యాప్తంగా తమ 5జీ సేవలను విస్తరించనున్నట్లు ప్రకటించింది. మే 2026 నాటికి మరో 90 నగరాలకు 5జీ నెట్‌వర్క్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు కంపెనీ వెల్లడించింది. ప్రస్తుతం 43 నగరాల్లో అందుబాటులో ఉన్న ఈ సేవలు, ఈ విస్తరణతో మొత్తం 133 నగరాలకు చేరనున్నాయి.

ఈ విస్తరణలో భాగంగా 5జీ డివైజ్‌లు ఎక్కువగా ఉపయోగిస్తున్న ప్రాంతాలు, అధిక డేటా వినియోగం ఉన్న పట్టణాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు సంస్థ తెలిపింది. ఆంధ్రప్రదేశ్‌లో తిరుపతి, తెలంగాణలో హైదరాబాద్‌తో పాటు చెన్నై, కోయంబత్తూర్, గోవా, పుదుచ్చేరి, వారణాసి, ప్రయాగ్‌రాజ్ వంటి ముఖ్య నగరాలు ఈ జాబితాలో ఉన్నాయి.

ఈ ప్రాజెక్ట్ కోసం కంపెనీ అంతర్జాతీయ సాంకేతిక సంస్థలైన ఎరిక్సన్, నోకియా, శాంసంగ్‌లతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా వినియోగదారులకు మెరుగైన నెట్‌వర్క్ అనుభవాన్ని అందించాలన్న లక్ష్యంతో ఈ చర్యలు చేపడుతోంది.

కంపెనీ చీఫ్ టెక్నాలజీ అధికారి జగ్బీర్ సింగ్ మాట్లాడుతూ, 5జీ వినియోగం వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో కీలక మార్కెట్లలో సేవలను విస్తరించడం తమ వ్యూహంలో భాగమని తెలిపారు. ఈ దశ విస్తరణతో ప్రధాన నగరాల్లో నెట్‌వర్క్ సామర్థ్యాన్ని మరింత పెంచుతున్నామని చెప్పారు.

---

## సోషల్ మీడియా యూజర్లకు అలర్ట్..

# కొత్త డిజిటల్ నిబంధనలు కఠినం

**న్యూఢిల్లీ, మార్చి 31 (తెలంగాణ ముచ్చట్లు):**



కేంద్ర ప్రభుత్వం డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లపై నియంత్రణను మరింత కట్టుదిట్టం చేసే దిశగా కీలక నిర్ణయం తీసుకుంది. ఎలక్ట్రానిక్స్ మరియు సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ ఐటీ నియమాలు 2021లో పలు కఠినమైన సవరణలను చేర్చింది. ఈ మార్పులతో సోషల్ మీడియా, టెక్నాలజీ, డిజిటల్ వేదికలు ఇకపై ఇష్టానుసారంగా వ్యవహరించే అవకాశం ఉండదని స్పష్టం చేసింది.

ఈ కొత్త నిబంధనలు ముఖ్యంగా మధ్యవర్తి వేదికలపై దృష్టి సారిస్తున్నాయి. అంటే వాట్సాప్, టెలిగ్రామ్ వంటి మెసేజింగ్ యాప్‌లు, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికలు, గూగుల్, యూట్యూబ్ వంటి సేవలు, అలాగే ఈకామర్స్ మరియు ఓటీటీ వేదికలు అన్నీ ఈ నియమాల పరిధిలోకి వస్తాయి. వినియోగదారులు పంచుకునే కంటెంట్‌పై ఈ వేదికలు కూడా బాధ్యత వహించాల్సి ఉంటుంది.

వినియోగదారుల డేటా భద్రత విషయంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడబోదని స్పష్టం చేసింది. డేటాను సురక్షితంగా నిల్వ చేయడం, నిర్దిష్ట కాలం పాటు భద్రపరచడం ఇకపై తప్పనిసరి. డేటా తొలగించడం లేదా నిర్లక్ష్యం చేయడం ద్వారా కంపెనీలు తప్పించుకోలేవు. అంతేకాకుండా, మంత్రిత్వ శాఖ నుంచి వచ్చే ప్రతి మార్గదర్శకాన్ని కచ్చితంగా పాటించాల్సిందే. గతంలో ఇవి సూచనలుగా భావించిన కంపెనీలు ఇప్పుడు తప్పించుకునే అవకాశం ఉండదు.

ఈ సవరణల్లో మరో ముఖ్య అంశం "సేఫ్ హార్బర్" రక్షణకు సంబంధించినది. ప్లాట్‌ఫారమ్‌లు ప్రభుత్వ ఆదేశాలను పాటించకపోతే ఈ రక్షణ కోల్పోయే ప్రమాదం ఉంది. అంటే వినియోగదారులు చేసే పోస్టుల బాధ్యత నుంచి తప్పించుకునే అవకాశాలు తగ్గుతాయి.

వార్తలు, సమకాలీన అంశాల కంటెంట్‌పై కూడా కఠినమైన పర్యవేక్షణ ఉండనుంది. ఒక వినియోగదారు సోషల్ మీడియాలో వార్తను షేర్ చేసినా, ఆ ప్లాట్‌ఫారమ్ కూడా జవాబుదారీగా ఉండాల్సి ఉంటుంది. దీంతో ఫేక్ న్యూస్ వ్యాప్తి తగ్గుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను కూడా బలోపేతం చేశారు. నైతిక నియమావళిని ఉల్లంఘించిన కేసులను పరిశీలించేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి, క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహించనున్నారు. అవసరమైతే మంత్రిత్వ శాఖ స్వయంగా కేసులను కమిటీకి పంపగలదు.

ఈ కొత్త నిబంధనలతో డిజిటల్ వేదికలపై నియంత్రణ పెరగనుండగా, వినియోగదారులు కూడా సోషల్ మీడియాలో ఏదైనా పంచుకునే ముందు మరింత జాగ్రత్తగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. నకిలీ వార్తలు, విద్వేషపూరిత వ్యాఖ్యలను నియంత్రించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నప్పటికీ, ఇది కంపెనీల స్వాతంత్ర్యంపై ప్రభావం చూపే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు.

---

## ఎండలే అవకాశాలు..

# చిన్న బిజినెస్‌లతో పెద్ద లాభాలు!

**విజయవాడ, మార్చి 31 (తెలంగాణ ముచ్చట్లు):**

మార్చి పూర్తికాకముందే ఎండలు తీవ్రరూపం దాల్చుతున్నాయి. ఈ వేసవిలో ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయికి చేరనున్నాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. అయితే ఈ ఎండలను భయపడాల్సిన అవసరం లేదు. ప్రజల అవసరాలను అర్థం చేసుకుని సరైన వ్యాపారాన్ని ఎంచుకుంటే తక్కువ పెట్టుబడితో మంచి లాభాలు సంపాదించవచ్చు. ముఖ్యంగా వేసవిలో చల్లదనం, తాగునీరు, శరీరానికి ఉపశమనం కలిగించే వస్తువులకు భారీగా డిమాండ్ ఉంటుంది. సరైన ప్లానింగ్‌తో రోజుకు వెయ్యి నుంచి మూడు వేల రూపాయల వరకు సంపాదించే అవకాశముంది.




వేసవిలో అత్యంత సులభంగా ప్రారంభించగల వ్యాపారం నేచురల్ జ్యూస్, మజ్జిగ కేంద్రం. చెరకు రసం, నిమ్మరసం, కొబ్బరి నీళ్లు, మజ్జిగ వంటి పానీయాలకు ఎప్పుడూ గిరాకీ ఉంటుంది. రద్దీ ప్రదేశాల్లో చిన్న స్టాల్ పెట్టినా తక్కువ రోజుల్లోనే పెట్టుబడి తిరిగి వస్తుంది. ఇదే విధంగా ఐస్‌క్రీమ్, కుల్ఫీ వ్యాపారం కూడా మంచి లాభాలను ఇస్తుంది. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ వేసవిలో ఐస్‌క్రీమ్‌ను ఇష్టపడతారు. ఇంట్లో తయారు చేసిన కుల్ఫీలతో కూడా మంచి ఆదాయం పొందవచ్చు. మట్టి కుండల వ్యాపారం కూడా ఇప్పుడు ట్రెండ్‌గా మారుతోంది. ఫ్రిజ్ నీళ్ల కంటే మట్టి కుండల్లో చల్లబడిన నీళ్లు తాగడానికి ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. రంగురంగుల కుండలు, మట్టి బాటిళ్లను హోల్‌సేల్‌గా తీసుకుని విక్రయిస్తే మంచి లాభం ఉంటుంది. అదేవిధంగా ఇండోర్ మొక్కలకు కూడా వేసవిలో డిమాండ్ పెరుగుతోంది. గాలి శుద్ధి చేసే మొక్కలు, గదిని చల్లగా ఉంచే ప్లాంట్స్ అమ్మితే మంచి ఆదాయం పొందవచ్చు. వేసవి రక్షణ వస్తువుల వ్యాపారం కూడా లాభదాయకం. గొడుగులు, సన్ గ్లాసెస్, టోపీలు, కాటన్ దుస్తులు వంటి వస్తువులకు భారీగా డిమాండ్ ఉంటుంది. కాలేజీలు, మార్కెట్లు, బస్టాండ్ల వద్ద వీటిని విక్రయిస్తే మంచి ఆదాయం వస్తుంది. అలాగే టెక్నికల్ పరిజ్ఞానం ఉన్నవారు కూలర్, ఏసీ రిపేర్ సేవలను అందిస్తే సీజన్ మొత్తం బిజీగా ఉండొచ్చు.

ఏ వ్యాపారమైనా విజయవంతం కావాలంటే నాణ్యత, పరిశుభ్రత చాలా ముఖ్యము. ముఖ్యంగా ఆహార సంబంధిత వ్యాపారాల్లో శుభ్రత పాటిస్తే కస్టమర్లు మళ్లీ మళ్లీ వస్తారు. సరైన ప్రదేశం, సరైన ఉత్పత్తి ఎంపికతో ఈ వేసవిని ఆదాయ అవకాశంగా మార్చుకోవచ్చు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక




# ‘పెద్ది’ రిలీజ్ మళ్లీ వాయిదా?

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న తాజా చిత్రం ‘పెద్ది’పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ముఖ్యంగా ‘గేమ్ ఛేంజర్’ తర్వాత వస్తున్న సినిమా కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై మెగా అభిమానులు ఆశలు పెట్టుకున్నారు. గ్రామీణ క్రీడల నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రానికి బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్నారు.

ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్, పాటలు సినిమాపై అంచనాలను మరింత పెంచాయి. ఇందులో రామ్ చరణ్ మాస్ లుక్‌లో కనిపించనున్నట్లు ఉండటంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది.

మొదట ఈ సినిమాను మార్చి 27న, రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేయాలని నిర్ణయించారు. కానీ అనివార్య కారణాలతో విడుదలను ఏప్రిల్ 30కి వాయిదా వేశారు. తాజాగా ఈ సినిమా మరోసారి వాయిదా పడే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

ఇటీవల జరిగిన ఒక కార్యక్రమంలో నిర్మాత ఎస్‌కేఎన్ ఈ సినిమా విడుదల తేదీని జూన్ 26గా ప్లాన్ చేస్తున్నట్లు సంకేతాలు ఇచ్చారు. దీంతో ‘పెద్ది’ మరోసారి వాయిదా పడుతుందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సినిమా షూటింగ్ ఇంకా పూర్తికాకపోవడం ఈ ఆలస్యానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. ముఖ్యంగా ఒక ప్రత్యేక గీతంతో పాటు మరో పాట చిత్రీకరణ ఇంకా మిగిలి ఉన్నట్లు సమాచారం. అలాగే ఇటీవల రామ్ చరణ్ కంటికి గాయం కావడం కూడా షూటింగ్ ఆలస్యానికి కారణమైంది. ఈ నేపథ్యంలో పోస్ట్ ప్రొడక్షన్ పనులు, ప్రచార కార్యక్రమాలు పూర్తి చేయడానికి మరింత సమయం అవసరమవుతుందని తెలుస్తోంది. ‘పెద్ది’ విడుదల తేదీ మారితే ఇతర సినిమాలపై కూడా ప్రభావం పడే అవకాశముంది. అఖిల్ అక్కినేని నటిస్తున్న ‘లెనిన్’ సినిమా జూన్ 26న విడుదలకు సిద్ధంగా ఉంది. అదే సమయంలో ‘పెద్ది’ వస్తే ఆ సినిమా తేదీ మారే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. అలాగే నిఖిల్ సిద్ధార్థ్ నటిస్తున్న ‘స్వయంభు’, తరుణ్ భాస్కర్ తెరకెక్కిస్తున్న ‘గాయపడ్డ సింహం’ చిత్రాల విడుదలలపై కూడా ప్రభావం ఉండొచ్చని భావిస్తున్నారు.

మరోసారి వాయిదా వార్తలు అభిమానులను నిరాశకు గురిచేస్తున్నప్పటికీ, మంచి నాణ్యత కోసం సమయం తీసుకోవడం మంచిదేనని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మొత్తంగా ‘పెద్ది’ కొత్త విడుదల తేదీపై ఆసక్తి నెలకొంది.

## ఇన్‌స్టాలో అన్‌ఫాలో షాక్.. రిషబ్ శెట్టి నిర్ణయంపై చర్చ

‘కాంతార’ సినిమాతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన కన్నడ నటుడు, దర్శకుడు రిషబ్ శెట్టి తాజాగా తీసుకున్న ఒక నిర్ణయం సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీసింది. తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో దాదాపు అందరినీ అన్‌ఫాలో చేసి, కేవలం మూడు అకౌంట్లను మాత్రమే ఫాలో అవుతూ ఉండటం అభిమానులను ఆశ్చర్యానికి గురిచేసింది. ప్రస్తుతం ఆయన ఫాలో అవుతున్న వాటిలో భార్య ప్రగతి శెట్టి ఖాతాతో పాటు, తన నిర్మాణ సంస్థ ‘రిషబ్ శెట్టి ఫిల్మ్స్’, సేవా కార్యక్రమాల కోసం నడుపుతున్న ‘రిషబ్ శెట్టి ఫౌండేషన్’ మాత్రమే ఉన్నాయి.

ఈ చర్య వెనుక అసలు కారణం ఏమిటన్న దానిపై అధికారికంగా ఎలాంటి ప్రకటన రాలేదు. అయితే సినీ వర్గాలు, సోషల్ మీడియా వేదికల్లో పలు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం రిషబ్ శెట్టి భారీ ప్రాజెక్టులైన ‘జై హనుమాన్’, ‘ది ప్రైడ్ ఆఫ్ భారత్’ వంటి చిత్రాల్లో నటిస్తున్న నేపథ్యంలో, పూర్తి ఏకాగ్రత కోసం సోషల్ మీడియా దూరంగా ఉండాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నాడని కొందరు భావిస్తున్నారు.

మరోవైపు, గతంలో కలిసి పనిచేసిన హోంబలే ఫిల్మ్స్ సంస్థను, సన్నిహిత మిత్రుడు రాజ్ బి. శెట్టి, హీరోయిన్ రుక్మిణి వసంత్‌లను కూడా అన్‌ఫాలో చేయడం చర్చనీయాంశంగా మారింది. అయితే హోంబలే సంస్థ అధినేత విజయ్ కిరగందూర్‌ను మాత్రం ఇంకా ఫాలో అవుతుండటం గమనార్హం.

సెలబ్రిటీలు తమ వ్యక్తిగత గోప్యత కోసం లేదా సినిమాలకు హైప్ తీసుకురావడానికి ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం కొత్తేమీ కాదని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. రిషబ్ శెట్టి నిర్ణయం వెనుక అసలు కారణం ఏమిటో తెలుసుకోవాలంటే ఆయన అధికారిక స్పందన కోసం వేచి చూడాల్సిందే.






## సల్మాన్-వంశీ సినిమాలో నయనతార

బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్, టాలీవుడ్ దర్శకుడు వంశీ పైడిపల్లి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రంలో హీరోయిన్‌గా నయనతారను అధికారికంగా ఎంపిక చేసినట్లు చిత్ర బృందం ప్రకటించింది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై ప్రముఖ నిర్మాతలు దిల్ రాజు, శిరీష్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇది ఆ సంస్థకు 63వ చిత్రంగా నిలవడం విశేషం.

ఈ సందర్భంగా చిత్ర బృందం విడుదల చేసిన ప్రకటనలో, ఈ భారీ ప్రాజెక్ట్‌లో నయనతారను భాగస్వామ్యం చేయడం గౌరవంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే హిందీ సినీ రంగంలో అడుగుపెట్టి భారీ విజయాన్ని అందుకున్న నయనతార, ఇప్పుడు సల్మాన్ ఖాన్ సరసన నటించబోతుండటం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

దర్శకుడు వంశీ పైడిపల్లి గతంలో తెరకెక్కించిన సినిమాలు మంచి విజయాలు సాధించిన నేపథ్యంలో, ఈ చిత్రంపై అంచనాలు మరింత పెరిగాయి. సల్మాన్ ఖాన్, నయనతార, వంశీ పైడిపల్లి కలయికలో రాబోయే ఈ చిత్రం భారీ స్థాయిలో రూపొందించేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే వెల్లడించనున్నట్లు చిత్ర బృందం తెలిపింది. ఈ సినిమా భారతీయ సినీ పరిశ్రమలో మరో భారీ ప్రాజెక్ట్‌గా నిలిచే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

## పీరియాడిక్‌గా ‘కథనార్’.. ట్రైలర్‌తో ఆసక్తి

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ అనుష్క శెట్టి ‘బాహుబలి’ తర్వాత కథల ఎంపికలో జాగ్రత్తగా ముందుకు సాగుతున్న సంగతి తెలిసిందే. ఇటీవల వచ్చిన చిత్రాలు ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోకపోయినా, ఇప్పుడు ఆమె భారీ అంచనాల మధ్య మలయాళంలో తెరకెక్కుతున్న ‘కథనార్’ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతోంది. ఈ సినిమాపై ఇప్పటికే సినీ వర్గాల్లో మంచి చర్చ జరుగుతోంది. శ్రీ గోకులం మూవీస్ పతాకంపై గోకులం గోపాలన్ నిర్మాణంలో, దర్శకుడు రోజిన్ థామస్ ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఇందులో అనుష్కతో పాటు జయసూర్య, ప్రభుదేవ, సనూప్ సన్, వినీత్, శాండీ మాస్టర్, హరీష్ ఉత్తమన్ వంటి నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. మలయాళంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని తెలుగు, తమిళం, కన్నడ, హిందీ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేయాలని మేకర్స్ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

ఇటీవల విడుదలైన ట్రైలర్ సినిమాపై అంచనాలను మరింత పెంచింది. ట్రైలర్‌లో కనిపించిన విజువల్స్, సెట్టింగ్స్, పీరియాడిక్ బ్యాక్‌డ్రాప్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. హాలీవుడ్ స్థాయి విజువల్ ఎఫెక్ట్‌స్‌తో సినిమా రూపొందుతున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. అనుష్క అభిమానులు ఈ సినిమాపై భారీ ఆశలు పెట్టుకున్నారు. ‘బాహుబలి’ తరహాలోనే మరోసారి బలమైన పాత్రలో ఆమె కనిపించనుందని భావిస్తున్నారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రైలర్‌కు మంచి స్పందన లభిస్తోంది. గత కొంతకాలంగా సరైన హిట్ కోసం ఎదురుచూస్తున్న అనుష్కకు ‘కథనార్’ కీలక చిత్రంగా మారే అవకాశముంది.

## గ్లామర్‌తో దివ్య భారతి సందడి

ఒకే ఒక్క సినిమాతో ఓవర్‌నైట్‌లో గుర్తింపు తెచ్చుకున్న హీరోయిన్లలో దివ్య భారతి ఒకరు. తన అందం, అభినయంతో తక్కువ సమయంలోనే కుర్రకారులో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న ఈ యువ నటి, సోషల్ మీడియాలో మాత్రం ఎప్పటికప్పుడు ట్రెండ్ అవుతూ ఉంటుంది.

తమిళ చిత్రం బ్యాచిలర్ ద్వారా సినీ రంగంలోకి అడుగుపెట్టిన దివ్య భారతి, ఆ చిత్రంలో బోల్డ్ పాత్రలో నటించి మంచి గుర్తింపు తెచ్చుకుంది. ముఖ్యంగా రొమాంటిక్ సన్నివేశాల్లో ఆమె నటన ప్రేక్షకులను ఆకట్టుకుంది. దీంతో తొలి సినిమాతోనే భారీ క్రేజ్‌ను సొంతం చేసుకుంది. అయితే ఆ తర్వాత వరుస అవకాశాలు వస్తాయని భావించినప్పటికీ, ఆమె కెరీర్ ఆశించినంత వేగంగా ముందుకు సాగలేదు. కొంత గ్యాప్ తర్వాత జీవీ ప్రకాశ్ సరసన ‘కింగ్‌స్టన్’ అనే సినిమాలో నటించినప్పటికీ, ఆ చిత్రం పెద్దగా విజయం సాధించలేదు. ప్రస్తుతం తెలుగులో కూడా అవకాశాలు అందిపుచ్చుకుంటూ ముందుకు సాగుతోంది. ప్రస్తుతం సుడిగాలి సుధీర్ హీరోగా తెరకెక్కుతున్న ‘గోట్’ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమా షూటింగ్ చాలా కాలంగా కొనసాగుతుండగా, త్వరలోనే విడుదలవుతుందనే సమాచారం ఉంది. ఈ ప్రాజెక్ట్‌తో తెలుగులో మంచి బ్రేక్ దక్కుతుందనే ఆశలు ఆమెపై ఉన్నాయి.

ఇదిలా ఉంటే సోషల్ మీడియాలో దివ్య భారతి గ్లామర్ ఫొటోలు తరచూ వైరల్ అవుతున్నాయి. తన స్టైలిష్ లుక్స్, ఆకట్టుకునే ఫోటోషూట్లతో అభిమానులను అలరిస్తూ వస్తోంది. తాజాగా ఆమె షేర్ చేసిన ఫోటోలు నెటిజన్లను ఆకట్టుకోవడంతో పాటు, కుర్రకారులో పెద్ద ఎత్తున చర్చకు దారితీస్తున్నాయి.

మొత్తంగా చూస్తే, సినిమాల్లో సరైన హిట్ కోసం ఎదురుచూస్తున్న దివ్య భారతి, సోషల్ మీడియాలో మాత్రం తన క్రేజ్‌ను కొనసాగిస్తూ ముందుకు సాగుతోంది. రాబోయే సినిమాలతో ఆమె కెరీర్ మళ్లీ ఊపందుకుంటుందా అన్నది చూడాలి.



Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in